



Truth of News
PRGI Reg No: APTEL/26/A4781

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్






అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 54 | శుక్రవారం 02 అక్టోబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




## గ్లోబల్ హీరో పైలెట్ మచ్చర్

- నిన్ను చూసి ప్రపంచం గర్విస్తోంది
- ఫ్లైదుబాయ్ సాహసవీరుడు స్మిత్ మచ్చర్
- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసల వర్షం
- కెప్టెన్ వీరత్వానికి దేశవిదేశాల్లో జేజేలు, పూజలు, సంబరాలు

**న్యూఢిల్లీ/ముంబై/దుబాయ్ - సూర్య వాస్తవం**

ఫ్లైదుబాయ్ విమానంలో తన కోపైలెట్ అ న్యూహ దాడిని వీరోచితంగా పోరాడుతూ.. తన ప్రాణాన్ని ఫణంగా పెట్టి, ప్రతిఘటించి.. 174 మంది ప్రయాణికులను రక్షించిన భార త సంతతి పైలెట్ స్మిత్ మచ్చర్ గ్లోబర్ హీర్ గో నిలిచారు. మరో 9/11 తరహా దాడిని అడ్డుకున్న అతని ధైర్యసాహసాలకు గురువారం దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకు న్నారు.

'నిన్ను చూసి ప్రపంచం గర్విస్తోంది' అని మచ్చర్‌ను కీర్తిస్తున్నారు. రాష్ట్రపతి ద్రౌప ది ముర్ము , ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సహా వివిధ దేశాల అధినేతల నుంచి సాధారణ పౌరుల వరకు ప్రతి గుండే అతని పొగడ్తలతో ప్రతిధ్వనించింది. సోషల్ మీడియాలో హోరెత్తింది. ప్రతిచోటా వీరత్వానికి ప్రతీకగా కీర్తించిం ది. వారణాసి, గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ముం బైలోని అతని తల్లిదండ్రుల ఇంటి బయట త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని

- మిగతా 2లో..

# సీఈసీ అప్రూవర్‌గా మారాలి

- ఫారం 7లో ఎవరి ఆదేశాలతో మార్పులు చేశారు?
- ముస్లిం ఓటర్ల వివరాలతో ఫారం 7 దరఖాస్తులు దొరికాయ్
- ఆ ముగ్గురి వల్ల ప్రజాస్వామ్యం నాశనం
- ఈసీ, కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫైర్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఓటరు నమోదు ఫారం ఫారం 7లో మార్పులు ఎవరి ఆదేశాలతో చేశారు? టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)తో ఈ మార్పులు చేయిం చింది ఎవరు? సంస్థపై ఒత్తిడి తెచ్చింది ఎవరు? అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈసీని, కేంద్ర ప్రభుత్వా న్ని నిలదీశారు. ఎస్ఐఆర్ ద్వారా ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కలిసి ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నా రని, వారు దేశద్రోహానికి పాల్పడుతున్నారని రాహుల్‌గాంధీ తీవ్రంగా ఆరోపించారు. సీఈసీ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎక్స్ వేదికగా వరుస పోస్టులు చేస్తూ ప్రశ్నల వర్షం కురిపించారు. సర్‌లో భాగంగా ఫారం-6కు అదనపు డిక్లరేషన్‌ను జోడించడంపై ఇటీవల వివాదం చెలరేగింది. ఈ డిక్లరేషన్‌లో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే వారు లేదా



తమ తల్లిదండ్రులు/తాత ముత్తాతలకు గతంలో జరిగిన ప్రత్యేక సవరణల ఓటర్ల జాబితాలతో ఉన్న సంబంధానికి సంబంధించిన వివరాలు ఇవ్వాల్సి ఉంది. ఈ అదనపు నిబంధనపై ఎన్నికల కమిషనర్లు ఎస్ఎస్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో వివాదం మరింత ముదిరింది. మరోవైపు సర్‌కు సంబంధించిన నిర్ణయాలన్నీ కమిషన్‌లో ఏకగ్రీవంగానే తీసుకు న్నట్లు ఈసీ వెల్లడించింది. సర్ ప్రక్రియ చేయబడిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఫారం-6కు జత చేసిన అదనపు డిక్లరేషన్‌ను సెప్టెం బర్ 30 నుంచి ఈసీ తొలగించింది. అక్కడ ఇక సాధారణ చట్టబద్ధమైన ఫారం-6 మాత్రమే నింపాల్సి ఉంటుంది. ఈ పరిణామాల నేపథ్యం లో ఫారం6లో అసలు మార్పులు ఎవరికి అనుగుణంగా, ఏ ప్రక్రియ ద్వారా, ఏ అధికారిక

- మిగతా 2లో..



## సీఈసీపై సీజేపీ సమరం

- జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేసేవరకు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తాం
- ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- 2025 ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేయాలి
- నెలాఖరులో జంతర్‌మంతర్ 2.0
- కాక్రోచ్ జనతా పార్టీ నాయకుడు అభిజీత్ దీప్కే
- మరోవైపు నేటి నుంచి 8 వరకు ఇండియా కూటమి సేవ్ డెమోక్రసీ మార్చ్

**ముంబై - సూర్య వాస్తవం :**

భారత ఎన్నికల ప్రధాన కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ సమరం

- మిగతా 2లో..

## రాయలసీమ దశ మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్..

- లక్ష కోట్లతో బృహత్ ప్రణాళిక
- రాయలసీమను ఫ్రూట్ బౌల్‌గా మార్చే గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- రూ.1 లక్ష కోట్ల భారీ బడ్జెట్‌తో మూడు దశల్లో ప్రాజెక్టు అమలు
- మదనపల్లెలో నిర్మల, చంద్రబాబు, పవన్ చేతుల మీదుగా పనుల ప్రారంభం
- భారత్‌లోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుకు శంకుస్థాపన
- పది జిల్లాల్లో ఉద్యాన సాగు విస్తరణ.. 9.6 లక్షల మంది రైతులకు లబ్ధి




**అమరావతి - సూర్య వాస్తవం**

రాయలసీమ రూపురేఖలను సమూలంగా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఒక బృహత్తర ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఈ ప్రాంతాన్ని దేశానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' ఏర్పాటుకు అంకురార్పణ చేసింది. అన్నమయ్య జిల్లా మదనపల్లెలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ ప్రాజెక్టు పనులను లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 1 లక్ష కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ. 40,352 కోట్లు భరించనుండగా, ప్రైవేటు రంగం నుంచి రూ. 60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. రాయలసీమ, ప్రకాశం ప్రాంతాల్లోని 10 జిల్లాలకు

- మిగతా 2లో..

## బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి..

- రేపే సుప్రీంకోర్టుకు వెళుతున్నాం: సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వంపై రేపల్లె సభలో చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వెంటిలేటర్‌పై పెడితే, తాము ఆక్సిజన్ అందించి కాపాడామన్న సీఎం
- అమరావతిని ఎడారి, శ్మశానం అన్నారని.. పోలవరాన్ని గోదావరిలో ముంచేశారని ఫైర్
- బీసీల రిజర్వేషన్లకు గత ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుపడిందని ఆరోపణ
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని స్పష్టం



**అమరావతి - సూర్య వాస్తవం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని, ఆర్థిక వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేశారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బాపట్ల జిల్లా రేపల్లెలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తెలుగుదేశం పార్టీ 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, గత 'గొడ్డలి పార్టీ' ప్రభుత్వం దాన్ని 24 శాతానికి తగ్గించిందని ఆరోపించారు. "దీనివల్ల దాదాపు 16,800 మంది బీసీలు పదవులు కోల్పోయారు. మేము మళ్లీ 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని చూస్తే, వాళ్లే కోర్టుకు వెళ్లి అడ్డుపడ్డారు. బీసీలపై ద్వేషంతోనే ఈ కుట్ర చేస్తున్నారు. అయినా మేం వెనకడుగు వేయం. రేపే సుప్రీంకోర్టుకు వెళుతున్నాం. బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాడతాం" అని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. "అప్పులు దొరక్కపోతే రాష్ట్ర ఆస్తులను తాకట్టు పెట్టారు. కనీసం మద్యపాన నిషేధం హామీని నిలబెట్టుకోకుండా, భవిష్యత్తులో 25 ఏళ్లపాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టి అప్పులు తెచ్చిన దారుణమైన పరిస్థితిని సృష్టించారు. మేం అధికారంలోకి వచ్చాక ఆ అప్పుల వడ్డీ రేట్లను తగ్గించి, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం" అని వివరించారు. ముఖ్యమంత్రి అంటే సెక్రటేరియట్‌లో కూర్చోవడం కాదని, సామాన్యుడిలా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టాలు తీర్చడమే తన బాధ్యత అని

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## నెల రోజుల్లో డీఎస్సీ 2.0

- అధికారులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు
- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్చ్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'
- విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాల గుర్తుగా ప్రతిష్టాత్మక గ్రంథాలయం

2లో



# సీఈసీ అప్రూవర్‌గా మారాలి

(మొదటిపేజీ తరువాయి)

అనుమతితో జరగాలనే అంశంపై స్పష్టత ఇవ్వా లని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆయన ప్రశ్నలు ప్రస్తుతం ఈసీ వ్యవస్థలో నిర్ణయాలు తీసుకునే విధానం, సాంకేతిక అమలుపై రాజకీయంగా కొత్త చర్చకు దారితీశాయి. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ ముగ్గు రూ కలిసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నారని, వారు దేశద్రోహా నికి పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు.

సీఈసీ రాజీనామా చేసి అప్రూవర్‌గా మారాలని డిమాండ్ చేశారు. అలాగే మోదీ, షాలపై విచారణ జరపాలని పిలుపునిచ్చారు. ముస్లిం ఓటర్ల వివరాలతో ఇప్పటికే ముద్రించిన ఫారం 7 దరఖాస్తులు ఇప్పుడు బెళగావిలో దొరికాయని, బూత్ లెవెల్ ఏజెంట్‌తో సహా తమకు బాగా తెలిసిన వ్యక్తుల పేర్లను తొలగించాలని కోరుతూ ఫారాలపై సంతకాలు చేయమ ని తమపై ఒత్తిడి తెచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు బూత్ లెవెల్ ఏజెంట్లు (బీఎల్ఓలు) చెప్పినట్లు 'ఎక్స్'లో వచ్చిన ఒక పోస్టుకు ప్రతిస్పం దనగా రాహుల్ తెలిపారు. ఓటు దొంగతనంపై యావత్ దేశం ఆగ్రహంతో ఉన్నా.. కూడా బీజేపీ–, ఈసీలు దుర్మార్గానికి ఒడిగడుగుతున్నాయని ఆరోపించారు. వా రు ఇంకా ఓట్ల చోరీ పనులు చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. కర్ణాటకలోని బెళగావిలో, దాదాపు 15,000 మంది ఓటర్ల పేర్లను ఒక్క దెబ్బతో చెరిపివేయడానికి ఒక కుట్ర జరిగిందని విమర్శించారు. మూడు రోజుల్లోనే (గత నెల 22, 23, 24 తేదీల్లో) ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించారని ఆరోపించారు.

# రాయలసీమ దశ మార్చేలా గ్లోబల్ హార్టికల్చర్ హబ్..

(మొదటిపేజీ తరువాయి)

చెందిన 303 మండలాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు.

'విత్తనం నుంచి ఎగుమతి వరకు' (సీడ్ టు షిప్‌మెంట్) అనే సమగ్ర విధానంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీని ద్వారా ప్రస్తుతం 8.41 లక్షల హెక్టార్లలో ఉన్న ఉద్యాన సాగును మరో 6 లక్షల హెక్టార్లకు విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వార్షిక ఉత్పత్తిని 222 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 435 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడం ద్వారా సుమారు 9.6 లక్షల మంది రైతులకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సాగునీటి వనరులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల అనుసంధానం, లాజిస్టిక్స్ వంటి కీలక మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించనుంది. మామిడి, అరటి, దానిమ్మ, టమాటాతో పాటు డ్రాగన్ ఫ్రూట్, అవకాడో వంటి విభిన్న తరహా పంటల సాగును కూడా ప్రోత్సహించనున్నారు.

**దేశంలోనే తొలి ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

ఈ కార్యక్రమంలో భాగంగా మదనపల్లెలోనే దేశంలోనే మొట్టమొదటి 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్' (ఐఎస్ఏ) ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పారిశ్రామిక రంగంలో 'ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్' (ఐఎస్‌బీ) తరహాలోనే, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో ఈ సంస్థ కార్యకలాపాలు సాగించనుంది. రిలయన్స్ సంస్థ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మార్కెట్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగించి ఈ సంస్థ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తుంది. తద్వారా 'రైస్ బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచ పటంలో 'ఫ్రూట్ బౌల్'గా కూడా నిలపాలన్నది ప్రభుత్వ దృఢ సంకల్పంగా స్పష్టమవుతోంది.

# నెల రోజుల్లో డీఎస్సీ 2.0

- అధికారులకు మంత్రి నారా లోకేశ్ కీలక ఆదేశాలు
- పదో తరగతి ఫలితాల కోసం 'మిషన్ మార్చ్' పకడ్బందీగా అమలు
- యూనివర్సిటీల్లో 1523 అధ్యాపక పోస్టుల భర్తీకి చర్యలు
- స్కూల్ డ్రాపౌట్ల నివారణకు 'జీరో డ్రాప్ అవుట్ మిషన్'
- విశాఖలో ఏయూ శతాబ్ది ఉత్సవాల గుర్తుగా ప్రతిష్టాత్మక గ్రంథాలయం

అమరావతి – సూర్య వాస్తవం

నెల రోజుల్లోపు డీఎస్సీ 2.0 నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. నోటిఫికేషన్ విడుదల నుంచి పోస్టింగ్ ఉత్తర్వుల జారీ వరకు ప్రతి దశలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఏపీ రిక్రూట్‌మెంట్ మోడల్‌ను దేశం మొత్తం ఆసక్తిగా గమనిస్తోందని, ఇతర రాష్ట్రాలు మన విధానాలను అనుసరించేలా సమర్థవంతంగా పనిచేయాలని ఆయన సూచించారు. పాఠశాల విద్యలో కీలక సంస్కరణలపై మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా 'మిషన్ మార్చ్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. బడి మానేసే పిల్లల సమస్యపై సింగపూర్ హోంమంత్రి షణ్ముగం చేసిన సూచనలను ప్రస్తావిస్తూ.. రాష్ట్రంలో 'జీరో డ్రాప్ అవుట్ మిషన్' చేపట్టాలని సూచించారు. డ్రాపౌట్ల నివారణలో సమాజంలోని పెద్దలను, స్థానిక ప్రముఖులను భాగస్వాములను చేయాలని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఉన్నత విద్యారంగంపై కూడా సమీక్షించిన లోకేశ్, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టుల భర్తీకి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ, ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ పూర్తయిందని, డిసెంబరులో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రాత పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. రాష్ట్రంలో పలు ప్రతిష్ఠాత్మక ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూమిని గుర్తించాలని మంత్రి సూచించారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో విశాఖపట్నంలో పబ్లిక్ లైబ్రరీ భాగస్వామ్యంతో ఒక ప్రతిష్ఠాత్మక గ్రంథాలయాన్ని నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 125 ఆటిజం సెంటర్ల ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# గ్లోబల్ హీరో పైలెట్ మచ్చర్

(మొదటిపేజీ తరువాయి)

భారీ జనసమూ హం జేజేలు పలుకుతూ సంబురాలు చేసుకుంది. కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన మచ్చర్, సౌదీ అరేబియాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నా రు. బుధవారం ఆకాశంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్న వేళ, ఫ్లైదుబాయ్ విమానం ఎఫ్‌జెడ్1073 అత్యవసర సంకేతాలు పంపి, 17,000 అడుగులకు పైగా వేగంగా కిందికి దిగి, సౌదీ అరేబియాలోని తబూక్ నగరంలో ఉన్న ప్రిన్స్ సుల్తాన్ బిన్ అబ్దెల్ అజీజ్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండైన విషయం తెలిసిందే. ఆ విమానంలోని కాక్‌పిట్ లో జరిగిన హింసా త్మక ఘర్షణ, రక్తసిక్తమైన మచ్చర్‌కు సంబంధించిన వీడియోలు వైరల్ అవ్వడంతో, ముంబైలోని ఘట్కోపర్‌కు చెందిన దుబా య్ పైలట్ ప్రపంచవ్యాప్తంగా సంచలనంగా మారారు. ఒక పెద్ద విషాదాన్ని నివారించడానికి తన ప్రాణాలను పణంగా పెట్టిన ఆయన 'నిస్వార్థ చర్య', 'వీరోచిత ధైర్యం', 'సమయ స్ఫూర్తి'ని ప్రశంసిస్తూ ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్, ప్రధాన మంత్రి మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల వర్షం కురిపించారు. ఎంతో మంది ప్రాణాలను కాపాడటంలో ఆయన చూపిన అసా ధారణ ధైర్యాన్ని కేంద్ర మంత్రులు, రాజకీయ నాయకులు, ముఖ్య మంత్రులు అంద రూ కొనియాడారు. వేలాది మంది ఇతర పైలట్ల మాదిరిగానే ఆయన కూడా నిరాడంబర జీవితం గడిపాడు. కానీ బుధవారం వరకు మచ్చర్ గురించి పెద్దగా ఎవరికీ తెలియదు. ఫ్లైట్ ఘటన తర్వాత వెబ్‌సైట్లు, సెర్చ్‌ఇంజన్లు, సోషల్ మీడియా ప్లాట్ ఫారమ్‌లు ఫుల్ ట్రాఫిక్‌కు గురయ్యాయి. ప్రజలు అతని గురించి జల్లెడ పట్టారు. అలాగే 2007– వెలింకార్ ఇనిస్టి ట్యూట్ నుంచి ఆన్లైన్ మేనేజ్మెంట్ డిగ్రీని అభ్యసించిన మచ్చర్, ఆ –స్కూల్ నుంచి కూడా గొప్ప ప్రశంసలు అందుకున్నారు. వెలింకార్ ఇనిస్టిట్యూట్‌లోని వీస్కూల్ డైరెక్టర్ డాక్టర్ పం కజ్ నాటు, అతడిని ఆకాశంలో ఒక నిజమైన హీరోగా అభివర్ణించారు. వెలింకార్ పూర్వ విద్యార్థి ఇంత ఉన్నత శిఖరాలకు ఎదగడం చూసి గర్వంగా ఉందన్నారు. 'మీ వీరత్వం ఈరోజు లెక్కలేనన్ని ప్రాణాలను కాపాడింది. ఆయన ధైర్యం, నిస్వార్థచర్యలు మేము అ మూల్యంగా భావించే విలువలకు నిజమైన నిదర్శనం, అని ఆ విమానయాన సంస్థ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మచ్చర్ ఆరోగ్యం, దీర్ఘాయువు కోసం సోమనాథ్ ఆలయంలో ఆలయ యాజమాన్యం మహామృత్యుంజ య హోమం చేసింది. కెప్టెన్ తండ్రి, తల్లి, భార్యతో తాను మాట్లాడానని చెప్పారు. ప్రతి భారత హృదయాన్ని స్మిత్ ధైర్యం గర్వంతో నింపుతుందని స్పష్టం చేశారు.

**మచ్చర్‌ను కలవడం చాలా ఊరట ఇచ్చింది : భారత రాయబారి**

తీవ్ర గాయాలపాలైన కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను కలిసిన తర్వాత తనకు 'చాలా ఊరట' కలిగిందని యూఏఈలోని భారత రాయబారి దీపక్ మిట్టల్(×అంఋఖఅ ాూఎమ్ఙంయిఖంశీతీ ఐవవఙఙుఖఎ వీఙ్ఖుశ్రీ) తెలిపారు. ప్రస్తుతం ఆయన 'ఆరోగ్యంగా ఉండి, కోలుకుంటున్నారని పేర్కొన్నారు. ఏఈ ప్రభుత్వం అందిస్తు న్న మద్దతు, వైద్య సేవలకు ధన్యవాదాలు తెలుపుతూ.. మిట్టల్ సోషల్ మీడియాలో తెలిపారు. అంతకుముందు ఆయన పైలట్ కుటుంబాన్ని కలిసి, 'భారతీయ హీరో' మచ్చర్ సంక్షేమం, ఆరోగ్యం విషయంలో భారత ప్రభుత్వం పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు.

**మరో 9/11 తరహా దాడిని అడ్డుకున్నారు: మోదీ**

తన ప్రాణాలకు ఏమాత్రం భయపడకుండా ధైర్యసాహసాలతో పోరాడి, మరో 9/11 తరహా దాడిని అడ్డుకున్న భారత సంతతి పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ సాహసాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశంసించారు. న్యూఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రసంగిస్తూ, కెప్టెన్ మచ్చర్ ప్రపంచానికి అత్యున్నత స్థాయి ధైర్యాన్ని ప్రదర్శించారని కొనియాడారు. తన ప్రాణాలకు ముప్పు ఉన్నా లెక్కచేయకుండా కెప్టెన్ మచ్చర్ ధైర్యంగా పోరాడి, మరో 9/11 తరహా దాడి జరగకుండా అడ్డుకున్నారని పీఎంఓ ప్రకటించింది. 140 కోట్ల మంది భారతీయులు కెప్టెన్ మచ్చర్కు సెల్యూట్ చేస్తున్నారని, ఆయన క్షేమం కోసం ప్రార్థిస్తున్నారని మోదీ తెలిపారు.

**మచ్చర్ వివేకం అద్భుతం: ట్రంప్**

కత్తిపోటుకు గురైన ఫ్లైదుబాయ్ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసిం చారు. అతడు 'చాలా విషమ పరిస్థితిలో' ఉన్నప్పటికీ, విమానాన్ని కూల్చే ప్రయత్నాన్ని నివారించడంలో సహాయపడేంతటి సమయస్ఫూర్తిని ప్రదర్శించారని ట్రంప్ కొనియాడారు.

ట్రంప్ మచ్చర్‌ను ఒక 'హీరో'గా కూడా అభివర్ణించారు. ఒమన్కు చెందిన కో–పైలట్ కత్తితో దాడి చేసిన తర్వాత మచ్చర్ కాక్పిట్ తలుపు తెరిచి, వెనక్కి పడిపోయి 'సహాయం కోసం కేకలు వేశాడని' ట్రంప్ చెప్పారు. పైలట్ పరిస్థితి చాలా విషమంగా ఉంది. బహు శా ఇప్పటికీ అలాగే ఉందేమో.. కానీ అతనికి ఉన్న వివేకం అద్భుతం. ఒక రకంగా అతను హీరో' అని ఓవల్ ఆఫీసులో ట్రంప్ మీడియాతో తెలిపారు.

# సీఈసీపై సీజేపీ సమరం

(మొదటిపేజీ తరువాయి)

చేయనుంది. సీఈసీ తన పదవి నుంచి తప్పుకునే వరకూ పోరాటం చేస్తామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన రాజీనామా చేయకపోతే శుక్రవారం (గాంధీజయంతి) నుంచి ముంబైలోని దాదర్‌లోని శివాజీ పార్కు వద్ద సీజేపీ 'జైల్ భరో ఆందోళన్' నిర్వహించనున్నట్లు మొదట ప్రకటించారు. అయితే, చివరకు భారీ నిర సన చేస్తామని స్పష్టం చేశారు. తర్వాత దేశవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఆ తర్వాత ఈ నెలాఖరున ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'జంతర్ మంతర్ 2.0' పేరుతో ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు. సీఈసీపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, 2025 ఓటర్ల జాబితాను ఫ్రీజ్ చేయాలని, తొలగించిన ఓటర్లను పునరుద్ధరించాలని, ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోపక్క సర్‌లో అక్రమాలకు బాధ్యతగా సీఈసీని తొలగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నుంచి 8వ తేదీ వరకు ఇండియా కూటమి కూడా పోరుకు దిగనుంది. దేశవ్యాప్తంగా 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' మార్చ్‌ను నిర్వహించనుంది. ముంబై ప్రెస్‌క్లబ్ సమావేశం లో గురువారం సీజేపీ వ్యవస్థాపక అధ్యక్షుడు అభిజీత్ దీప్కే మాట్లాడుతూ.. సీఈసీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీజేపీ డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం అధిపతిగా జ్ఞానేశ్‌కుమార్ వైదొలిగే వరకు నిరసనలు కొనసా గుతాయని తేల్చిచెప్పారు.

మొదట దేశంలోని ఇతర ప్రధాన నగరాలకు ఈ ఉద్యమాన్ని విస్తరిస్తామని, 'గోవా, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల్లో నిరసనలు జరుగుతాయని చెప్పారు. ఒకవేళ ఆయన అప్పటికీ రాజీనామా చే యకపోతే, అక్టోబర్ చివరి నుంచి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఈసీ నియామకం పారదర్శకం గా జరగాలని, ఇందులో పౌర సమాజం (సివిల్ సొసైటీ) భాగస్వామ్యం ఉండాలని కూ డా దీప్కే డిమాండ్ చేశారు. 2025 ఓటర్ల జాబితాను యథాతథంగా ఉంచాలని (ఫ్రీజ్ చేయాలని) కోరిన ఆయన, దానిని ఇకపై మార్చకూడదని అన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని, తొలగించిన ఓటర్ల జాబితాను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ఈ ఓట ర్ల సవరణ ప్రక్రియలో జరిగిన నిర్ణయాలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో లేదా ఒక స్వతం త్ర కమిషన్ ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 2023లో కేంద్ర ప్రభు త్వం తెచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని రద్దు చేయాలని పట్టుపట్టారు. స్పెష ల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో అ క్రమాలు జరిగాయని, యువ ఓటర్లను ఉద్దేశపూర్వకంగా జాబితా నుంచి తొలగిస్తున్నారని సీజేపీ ఆరోపించింది. ఎన్నికల సంఘంలోని మరో ఇద్దరు కమిషనర్లు (సుఖ్బీర్ సిం గ్ సంధు, వివేక్ జోషి) కూడా ఈ సర్ ప్రక్రియకు సంబంధించి గత 10 నెలల్లో దాదాపు 14 సార్లు తమ లిఖితపూర్వక అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తా కథనాల నేపథ్యంలో సీఈసీ రాజీనామా డిమాండ్ మరింత తీవ్రరూపం దాల్చింది. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ సహా ప్రతిపక్ష కూటమి (ఇండియా అలియన్స్) కూడా సీఈసీ తీరు ను తప్పుబడుతూ ఇప్పటికే దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇదే అంశంపై మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్), శివసేన (యూబీ టీ) ఈ నెల 4న ముంబై లో ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా భారీ నిరసన ర్యాలీని నిర్వహించనున్నాయి.

**నేటి నుంచి 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' మార్చ్**

దేశంలో సర్(ఎస్ఐఆర్) వివాదంపై ఇండియా కూటమి శుక్రవారం నుంచి రంగంలోకి దిగనుంది. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. మహాత్మా గాంధీజీ జయంతి సం దర్భంగా దేశవ్యాప్తంగా 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' ర్యాలీలను ప్రారంభించ నుంది. ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు 'సేవ్ డెమోక్రసీ' మార్చ్ నిర్వహిస్తామని, అలాగే 6న ప్రతిపక్ష ఎంపీలందరూ ఎన్నికల కమిషన్(ఈసీ) ప్రధాన కార్యాలయం వరకు పాదయాత్ర చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం న్యూఢిల్లీలో ప్రకటించిన విషయం తెలిసిందే. సీఈసీ జ్ఞానేష్‌ను తక్షణమే తొల గించాలని 19 ప్రతిపక్ష పార్టీల నేతలు ఏకగ్రీవంగా డిమాండ్ చేశారు.

# బీసీ రిజర్వేషన్లకు గొడ్డలి పార్టీయే అడ్డంకి..

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు.

**అమరావతి జోలికెళితే మసైపోతారు!**

రాజధాని అమరావతి, జీవనాడి పోలవరం ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నాశనం చేసిందని చంద్రబాబు ఆరోపించారు. "సైబరాబాద్‌ను నిర్మించిన అనుభవంతో అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనుకుంటే, అధికారంలోకి రాగానే మూడు రాజధానులంటూ నాటకాలకు తెరలేపారు. అమరావతిని ఎడారి, శ్మశానం అంటూ సర్వనాశనం చేశారు. కానీ రైతుల త్యాగాలు, ముక్కోటి దేవతల ఆశీస్సులతో అమరావతి నిలబడింది. ఇకపై అమరావతిని ఒక్క ఇంచు కూడా ఎవరూ కదిలించలేరు. ఆ ప్రయత్నం చేస్తే మసి అయిపోతారు" అని తీవ్రంగా హెచ్చరించారు. అదేవిధంగా, పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదావరిలో ముంచేశారని, తాము మళ్లీ దాన్ని బాగుచేసి వచ్చే ఏడాది మార్చి నాటికి ఫేజ్–1 పూర్తి చేసి కృష్ణా నదికి నీళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రతిపక్షంలో నిర్మాణాత్మక పోటీతత్వం ఉండాలి గానీ, గత ప్రభుత్వంలో కుట్రతత్వం మాత్రమే ఉందని చంద్రబాబు విమర్శించారు. "మేం పరిశ్రమలు తెస్తే, వాళ్లు పారిశ్రామికవేత్తలను తరిమికొట్టారు. ఇప్పుడు మళ్లీ పారిశ్రామికవేత్తలు రాష్ట్రానికి క్యూ కడుతున్నారు. వ్యాన్‌పిక్ వంటి ప్రాజెక్టులను అవినీతితో నాశనం చేసి, ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకున్నారు. ఇప్పుడు సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నారు. మేం రోడ్లు వేస్తే వాళ్లు గుంతలు తవ్వారు. పట్టాదారు పాసుపుస్తకాలపై, సర్వే రాళ్లపై కూడా వాళ్ల బొమ్మలు వేసుకొని రూ.800 కోట్లు దుర్వినియోగం చేశారు" అని ఆరోపించారు. వీటన్నింటినీ సరిచేసి, భూ సమస్యలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీతో శాశ్వత పరిష్కారం చూపుతున్నామని తెలిపారు.

**పాలనలో మార్పులు, అభివృద్ధి మంత్రం**

తాము కేవలం బటన్ నొక్కి డబ్బులు పంచే ప్రభుత్వం కాదని, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు అన్నారు. పీ4 కార్యక్రమం ద్వారా మార్గదర్శి కుటుంబాలు, బంగారు కుటుంబాల పేరిట ఆర్థిక అసమానతలు తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. 'ఆరోగ్యం, ఆదాయం, ఆనందం' అనే మూడు సూత్రాలతో 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్యాన్ని ప్రజల భాగస్వామ్యంతో సాధిస్తామని చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు.

**మోదీ, పవన్‌తో కలిసే హామీ ఇచ్చాం!**

2024 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి ప్రజల వద్దకు వచ్చామని, రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని హామీ ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుర్తుచేశారు. ఆ నమ్మకంతోనే ప్రజలు కూటమికి 54% ఓట్లు, 94% సీట్లతో చారిత్రక విజయాన్ని అందించారని అన్నారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని తాము బాధ్యతగా స్వీకరించామని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ ప్రజలకు సేవకులే తప్ప పెత్తందారులు కాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసలు కురిపించారు. రైల్వే స్టేషన్‌లో టీ అమ్మిన ఒక సాధారణ కుటుంబానికి చెందిన వ్యక్తి, తన సమర్థతతో దేశ ప్రధాని స్థాయికి ఎదిగారని కొనియాడారు.

ప్రజాస్వామ్యంలో ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ కలిగిన నేతగా మోదీ నిలిచారని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎన్నో విజయాలు సాధిస్తోందని, ఆ అవకాశాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 2024లో లభించిన చారిత్రక తీర్పు వెనుక ప్రధాని మోదీ, పవన్ కల్యాణ్‌తో ఉన్న మైత్రి కీలక పాత్ర పోషించిందని ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## సంపాదకీయం

# నష్ట నివారణా చర్యల్లో ఈసీ




ఎన్నికల ప్రధాన కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి 14 అభ్యంతరాలు వ్యక్తం చేసిన విషయం బయటపడి తీవ్ర సంచలనం కలిగించాయి. దీంతో కాక్రోచ్ జనతా పార్టీ, విపక్షాలు ఆందోళనకు దిగడం, ఎన్నికల కమిషన్‌పై ప్రజల్లో ప్రతికూల అభిప్రాయం ఏర్పడడంతో ఎన్నికల కమిషన్ తన అప్రతిష్ఠను నివారించుకునే చర్యలు చేపట్టింది. కమిషనర్ల ఫిర్యాదులను కొంతవరకు అంగీకరించింది. ఇకపై సమావేశాలకు ముందే అజెండాను పంపుతామని, సమావేశాల తరువాత మినిట్స్ (నిర్ణయాల వివరాలను) అందజేస్తామని, తదితర వివరణలతోపాటు 'సర్' లో లోపాలు ఉన్నాయని పరోక్షంగా అంగీకరించింది. ఓటరు జాబితానుంచి ఎవరి పేరైనా తొలగించినట్టయితే వారిని తిరిగి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ఎలెక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లకు సూచించింది. అయితే 'పశ్చిమబెంగాల్‌లో న్యాయాధికారులు చేర్చిన ఓటర్లను తొలగించేందుకు 16.1లక్షల అప్పీళ్లను ఎవరు అనుమతించారు?' అని ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు అడిగిన ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్) వ్యవహారంపై కాంగ్రెస్, ఎన్నికల సంఘం మధ్య వివాదం మరింత ముదురుతోంది. సర్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం ప్రకటించిన అరకొర చర్యలు సమస్యకు పరిష్కారం కాదని, ఇప్పటికే జరిగిన పరిణామాలపై నష్ట నివారణ ప్రయత్నమేనని (డ్యామేజ్ కంట్రోల్) కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. శుక్రవారం రాత్రి విడుదల చేసిన పత్రికా ప్రకటన తన తప్పుల్ని కప్పిపుచ్చుకోవడానికి చేసిన వృథా ప్రయత్నం అని స్పష్టం చేసింది. పాక్షికంగా చేసే దిద్దుబాటు చర్యల వల్ల లక్షలాది మంది ఓటర్ల హక్కులను కాలరాస్తున్నారని ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ విమర్శించారు. ఓటర్ల తొలగింపుపై ఈసీ అనుసరిస్తున్న విధానాలు పౌరుల ప్రజాస్వామ్య హక్కులకు విఘాతం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సంఘం ప్రతిపాదించిన చర్యలు- సర్ ప్రక్రియలో సమస్యలు ఉన్నాయనే విషయాన్ని పరోక్షంగా అంగీకరించినట్లేనని ఆయన అన్నారు. కొద్ది మంది ఓటర్లకు ఉపశమనం కలిగించేలా తీసుకుంటున్న చర్యలు- భారీ స్థాయిలో జరిగిన ఓటర్ల తొలగింపును సరిచేయలేవని వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన క్లారిఫికేషన్‌ను తోసిపుచ్చుతూ జైరాం రమేశ్ పలు అంశాల్ని లేవనెత్తారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ముప్పులో ఉన్న 5.43 కోట్ల మంది ఓటర్ల ఇళ్లకు బూత్ లెవెల్ అధికారులు (ఃబూ) వెళ్తారని ఎన్నికల సంఘం చెప్పడం విడ్డూరంగా ఉందని, మొదటి దశలోనే నిబంధనలు సరిగ్గా అమలు కాలేదని, అప్పుడే సరిగా జరగని ఇళ్ల సర్వేను మళ్లీ చేస్తామనడంలో అర్థమే లేదని విమర్శించారుజ్ఞానేశ్ కుమార్ నేతృత్వం లోని ఎన్నికల కమిషన్ 'సర్' ప్రక్రియ ద్వారా ముసాయిదా ఓటర్ల జాబితాలనుంచి 13కోట్లకు పైగా పేర్లను తొలగించింది. స్వయంగా అర్హులైన ఓటర్లను నమోదు చేయాల్సిన ప్రభుత్వ బాధ్యతను ఓటర్లపైనే మోపుతున్నారన్న విమర్శలు వచ్చాయి అంటే పేర్లను ముందుగా తొలగించి, తరువాత వాటిని ధ్రువీకరించే విధానం అమలైంది. తిరిగి ఓటర్ల జాబితాలో పేరు చేర్చుకోవడానికి ఓటర్లపై కఠినమైన, భారమైన నిబంధనలు విధిస్తున్నారని ఆరోపణలు వచ్చాయి. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా (సర్) రాజ్యాంగబద్ధమైనదా కాదా అనే విషయంపై సుప్రీం కోర్టు నెలల తరబడి నిర్ణయం తీసుకోకపోవడంతో కొన్ని లోపాలు చోటుచేసుకున్నాయి. చివరకు మే 27న కోర్టు తీర్పు ఇచ్చే సమయానికి బీహార్, పశ్చిమబెంగాల్, రెండో దశలోఉన్న ఇతర రాష్ట్రాల్లో 'సర్' ప్రక్రియ అప్పటికే ప్రారంభమై, వాస్తవ పరిస్థితిని మార్చేసింది. సుప్రీం కోర్టు తీర్పు ఎడిఎం జబల్‌పూర్ కేసులో ప్రభుత్వం పట్ల కోర్టు చూపిన విధేయతను గుర్తు చేసేలా ఉందన్న విమర్శలు తలెత్తాయి. 'సర్'ను ఆచరణలో ఎలా అమలు చేశారన్న దానికంటే సిద్ధాంతపరంగా ఎలా ఉండాలో కోర్టు చూసింది. అసాధారణమైన, నిర్దిష్టమైన సందర్భాల్లో మాత్రమే చేయాల్సిన ఓటర్ల జాబితా సవరణ నిబంధనను, రాష్ట్రవ్యాప్తంగా భారీస్థాయిలో సవరణ చేయడానికి అనుమతిగా భావించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్నవారు అర్హులేనని నిరూపించాల్సిన అవసరం లేదని చెప్పినప్పటికీ, సర్ ద్వారా వారు మళ్లీ తమ అర్హతను నిరూపించుకోవలసి వచ్చింది. అలాగే 1995 నాటి సుప్రీం కోర్టు తీర్పులో ఓటర్ల జాబితాలో ఎవరి పేరునైనా తొలగించడానికి వ్యక్తిగత కారణం ఉండాలని వెల్లడించిన విషయాన్ని కూడా ఇప్పటి సుప్రీం కోర్టు తీర్పు పక్కన పెట్టిందని విమర్శలు వస్తున్నాయి. పశ్చిమబెంగాల్ లోని ట్రైబ్యునల్ తీర్పు ఇచ్చిన అప్పీళ్లలో 90 శాతానికి పైగా, అసెంబ్లీ ఎన్నికలు జరిగిన కొన్ని నెలల తర్వాత తొలగించబడిన ఓటర్లను మళ్లీ ఓటర్ల జాబితాలో చేర్చారు. ఢిల్లీ లోని మూడోవంతు నియోజకవర్గాల్లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్ల సంఖ్య 2025లో వాస్తవంగా ఓటు వేసిన వారికంటే తక్కువగా ఉంది. ఢిల్లీలో ఆగస్టు 31న విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో 97.5లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వారిలో 31.6 లక్షల మందికి రెండు కారణాల కింద నోటీసులు జారీ చేశారు. ఒకటి ఓటరు వివరాలను సంబంధిత పాత రికార్డులతో సరిపోల్చలేకపోవడం, రెండోది తార్కిక వ్యత్యాసాలు. రెండోది.. ఓటరు వివరాల్లో కొన్ని అసంగతలు ఉండడం. దీంతో 31.6లక్షల మంది ఓటర్లు ఇఆర్ఒ, ఎఇఆర్ఒ కార్యాలయాలకు స్వయంగా వెళ్లాల్సి వస్తుందేమో అన్న ఆందోళన ఏర్పడింది. అయితే ఇప్పుడు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం బూత్‌లెవెల్ అధికారులు (బిఎల్ఒ) ఓటర్ల ఇళ్లకే వెళ్లి వివరాలను పరిశీలిస్తారు. అత్యవసరమైన, ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగతంగా విచారణకు హాజరు కావలసి ఉంటుంది. అంటే పౌరుడు ఇబ్బందులు పడుతూ అధికారులను సంప్రదించాల్సిన పరిస్థితి లేకుండా సంస్థే పౌరుడు దగ్గరకు వెళ్లే విధానం అమలవుతుంది. అయితే ఈ పనిని కేవలం 14,000 మంది బూత్ లెవెల్ అధికారులు ఎలా నిర్వహిస్తారనేది ఆందోళన కలిగించే విషయం. రాత్రుళ్లు షెల్టర్లలో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు, మొదలైన వారి వివరాల నమోదు కోసం తగిన హెల్ప్ డెస్కులు, ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తామని ఎన్నికల కమిషన్ చెబుతోంది. మరి ఇది ఎలా అమలవుతుందో చూడాలి. మరో ముఖ్యమైన ఓటరు సమస్య ఫారం 6. ఓటర్ల జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునే ప్రతి పెద్దవారు ఈ ఫారమ్‌ను నింపాలి. ఆన్‌లైన ఫారమ్ 6 లో కొత్త ఓటర్లు తమ తల్లిదండ్రులు, లేదా తాతయ్య, అమ్మమ్మలు చివరి 'సర్'కు సంబంధించిన ఓటర్ల జాబితాలో ఉన్నారా? అన్నది ప్రకటించాలి. అయితే కొత్త ఓటర్లు ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండానే ఫారమ్ 6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అయితే 'సర్' ప్రక్రియలో ఇలాంటి నిబంధన ఉండకూడదన్న వాదన వస్తోంది. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. ప్రభుత్వ ఆధిపత్యం చెలాయించలేని విధంగా ఉండే ఎంపిక కమిటీ ద్వారా ఎన్నికల కమిషన్‌ను పునర్వ్యవస్థీకరించాలి.




# పేదవాడి ప్రాణం.. అంబులెన్స్ బేరం..!

- ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద అంబులెన్స్ దందా ?
- పేదల పాలిట వైద్యం పెనుబారమేనా...
- వైద్యం కోసం వస్తే.. అంబులెన్స్ బిల్లుతో బెంబేలు!
- ప్రైవేట్ అంబులెన్స్‌ల ఛార్జీలపై నియంత్రణ లేదా?
- ఎన్నిసార్లు ఆరోపణలు వచ్చినా విచారణ ఎందుకు లేదు?
- రోగుల ఆవేదనపై అధికారులు స్పందించేది ఎప్పుడు?

**అనంతపురం వైద్యం - సూర్య వాస్తవం :** అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు అత్యవసర సమయంలో మరో ఇబ్బంది ఎదురవుతోందని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు లేదా బెంగళూరుకు వెళ్లాలని వైద్యులు సూచించిన సందర్భాల్లో ఆసుపత్రి బయట అందుబాటులో ఉండే అంబులెన్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇదే అదనుగా కొందరు అంబులెన్స్ నిర్వాహకులు అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్నారని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. అనంతపురం నుంచి కర్నూలుకు తీసుకెళ్లేందుకు ఆసుపత్రి బయట ఉన్న కొన్ని అంబులెన్స్‌లు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు, బెంగళూరుకు వెళ్లేందుకు రూ.9,000 నుంచి రూ.9,500 వరకు అడుగుతున్నారని బాధితులు చెబుతున్నారు. అయితే ఆసుపత్రి బయట కాకుండా ఇతర అంబులెన్స్‌లను సంప్రదిస్తే కర్నూలుకు సుమారు రూ.4,000, బెంగళూరుకు రూ.6,000 నుంచి రూ.6,500 వరకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారని వారు పేర్కొంటున్నారు.

### 20 రోజుల క్రితం మరో ఘటన..

సనప ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం సుమారు 20 రోజుల క్రితం తమ కుటుంబ సభ్యుడిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించినట్లు తెలిపింది. రోగి పరిస్థితిని పరిశీలించిన వైద్యులు వెంటనే బెంగళూరుకు తీసుకెళ్లాలని సూచించడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రి బయట ఉన్న అంబులెన్స్‌ను సంప్రదించగా రూ.9,500 అడిగారని ఆరోపించారు. అదే సమయంలో ప్రైవేట్ ఆసుపత్రి వద్ద ఉన్న మరో అంబులెన్స్‌ను సంప్రదించగా రూ.6,500కే బెంగళూరుకు తీసుకెళ్లేందుకు అంగీకరించారని వారు మీడియాకు తెలిపారు.

### రూ.2 వేల కోసం మరో కుటుంబం ఆవేదన..

తాజాగా మడకశిర ప్రాంతం నుంచి వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఓ రోగిని వైద్యులు పరీక్షించి కర్నూలుకు తీసుకెళ్లాలని సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆసుపత్రి బయట ఉన్న అంబులెన్స్‌ను సంప్రదించగా రూ.6,000 అడిగారని, అంత మొత్తం తమ వద్ద లేకపోవడంతో బయట మరో అంబులెన్స్‌ను మాట్లాడుకోగా రూ.4,000కే తీసుకెళ్లేందుకు అంగీకరించారని చెప్పారు. అయితే బయట నుంచి మాట్లాడుకున్న అంబులెన్స్ ఆసుపత్రి లోపలికి వెళ్లకుండా అక్కడి అంబులెన్స్ డ్రైవర్ అడ్డుకున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ విషయంపై వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### కూలి కుటుంబాలకు అదనపు భారం

రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవించే కుటుంబాలు ప్రభుత్వ ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటాయని, రోగి పరిస్థితి విషమంగా ఉందని తెలిసిన సమయంలో ఒక్కసారిగా రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు అంబులెన్స్ ఖర్చు భరించడం తమకు సాధ్యం కాదని పలువురు రోగుల బంధువులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి బయట అంబులెన్స్‌ల ఛార్జీలపై గతంలోనూ పలు సందర్భాల్లో వార్తలు వచ్చినప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అంబులెన్స్‌లకు ఏమైనా నిర్ణీత ఛార్జీలు ఉన్నాయా? ఆసుపత్రి ప్రాంగణంలోకి ఇతర అంబులెన్స్‌లను అనుమతించకపోవడానికి కారణమేంటి? రోగుల అత్యవసర పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు విచారణ చేపడతారా? అనే ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. రోగుల ఆవేదనపై జిల్లా అధికారులు స్పందించి, అంబులెన్స్‌ల ఛార్జీలు, ఆసుపత్రి పరిధిలో వాటి నిర్వహణపై స్పష్టమైన నిబంధనలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# ప్రజాధనం ప్రచారానికా..? ప్రజాసమస్యల పరిష్కారానికా..!



- ఇన్‌ఫ్లుయెన్సర్లకు నిధులు.. పేదల సమస్యలు గాలికి..!?
- ఆసుపత్రుల్లో స్ట్రెచ్చర్లు లేవు.. ప్రచారానికి మాత్రం నిధులా..!
- ప్రచారం కోసం ఖర్చు.. సంక్షేమం కోసం మొండి చెయ్యా...?
- ప్రచారానికి పైసలు.. ప్రజా సమస్యలకు పరిష్కారం ఎప్పుడు..?
- పథకాలు ప్రజల కోసం.. ప్రచారం ఇన్‌ఫ్లుయెన్సర్లతో ఎందుకు..?
- చిన్నారుల అరుదైన వ్యాదికి భరోసా ఏది?
- ప్రజాధనంతో ప్రచారం.. ఇదేనా పాలన ప్రాధాన్యత..!

**అనంతపురం - సూర్య వాస్తవం ప్రత్యేక కథనం :** ప్రభుత్వ పథకాలను సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల ద్వారా ప్రచారం చేయించేందుకు ఏపీ ప్రభుత్వం కొత్త ఇన్‌ఫ్లుయెన్సర్ పాలసీకి ఆమోదం తెలిపింది. అర్హత కలిగిన ఇన్‌ఫ్లుయెన్సర్లకు ఫాలోవర్ల ఆధారంగా నెలకు రూ.2,500 నుంచి రూ.15,000 వరకు పారితోషికం అందించే విధానం రూపొందించినట్లు సమాచారం. సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ పాలసీని అమలు చేయనున్నారు. ప్రజాధనాన్ని వినియోగించాలనే ప్రభుత్వ నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ప్రజలకు ఉపయోగకరంగా ఉండే సంక్షేమ పథకాలు అమలు చేస్తే వాటి ప్రయోజనాలను ప్రజలే ఒకరికి ఒకరు చెప్పుకుంటారని, అంతేకాక ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో ప్రత్యేకంగా ఇన్ఫ్లుయెన్సర్లకు ప్రజాధనాన్ని చెల్లించి ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రజల ప్రాధాన్యత అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిధులను ఇతర ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగిస్తే మరింత ప్రయోజనం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### రైతుల సమస్యలు.. ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాల కొరత

వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ సమస్యలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రచార కార్యక్రమాలకు నిధులు కేటాయించడం అవసరమా అని ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వీల్‌చైర్లు, స్ట్రెచ్చర్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో లేక రోగులను కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతూ తరలిస్తున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటువంటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాల్సిన అవసరం ఉన్న సమయంలో ప్రచారానికి ప్రజాధనం వినియోగించడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని పలువురు కోరుతున్నారు.

### అరుదైన వ్యాధులతో చిన్నారుల కుటుంబాల వేదన

డీఎండీ, ఎస్ఎంఏ వంటి అరుదైన వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల కుటుంబాలు చికిత్స కోసం భారీ మొత్తాలను సమీకరించాల్సిన పరిస్థితులు ఉన్నాయని ప్రజా సంఘాలు, బాధిత కుటుంబాలు చెబుతున్నాయి. కొంతమంది తల్లిదండ్రులు సోషల్ మీడియా ద్వారా క్రౌడ్‌ఫండింగ్ కోరుతూ ప్రజలను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేక సహాయ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనే డిమాండ్లు కూడా వినిపిస్తున్నాయి. ప్రచారానికి కేటాయించే నిధుల్లో కొంత భాగాన్ని ఇలాంటి అత్యవసర ప్రజా అవసరాలకు మళ్లించవచ్చుకదా అని ప్రశ్నిస్తున్నారు.

### ప్రజాధనం.. ప్రచారానికా? ప్రజా సంక్షేమానికా?

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం అవసరమే అయినప్పటికీ, ఇందుకోసం ఇన్ఫ్లుయెన్సర్లకు ప్రజాధనం చెల్లించే విధానం, దాని ఎంపిక ప్రక్రియ, ఖర్చు వివరాలు, ఫలితాలను ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం అమలు చేసే పథకాలు నిజంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ఉంటే వాటి ఫలితాలే సహజంగా ప్రచారం అవుతాయని, ముందుగా ప్రజల ప్రాథమిక సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు సూచిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులు, రోగులు, పేదలు, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న చిన్నారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఇన్ఫ్లుయెన్సర్ల ప్రచారానికి కేటాయించే నిధులపై ప్రభుత్వం పునరాలోచించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విధానంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు ప్రజాధనం వినియోగంపై పూర్తి పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తున్నారు.

# కోనేపల్లిలో అంగణవాడి కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే జయరాం



**పామిడి – సూర్య వాస్తవం :** పామిడి మండలంలోని కోనేపల్లి గ్రామంలో పల్లె పండుగలో భాగంగా అంగన్వాడి కేంద్రాన్ని గురువారం గుంతకల్ నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ఆకస్మిక తనిఖీ చేసారు. అంగణవాడి టీచర్స్ వారికీ ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే జయరాం చేతుల మీదుగా అంగన్వాడీ వర్కర్లకు చీరలు చిన్న పిల్లలకు గ్లాసులు,ప్లేటు అందజేయడం జరిగింది. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు గర్భిణీలకు అందుతున్న సేవలు, పౌష్టికాహారం అందిస్తున్న తీరుపై ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పరిశీలించి పిల్లలకు, గర్భిణీలకు అందిస్తున్న గుడ్లు, పాలు, ఇతర పౌష్టికాహార నాణ్యతను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ షర్మిల, కోనేపల్లి గ్రామ అంగన్వాడి వర్కర్లు,పామిడి పట్టణం మరియు మండల కూటమి నాయకులు కార్యకర్తల అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌కు నో... ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు యెస్...!

**- జేఎన్టీయూఏలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం**

**- డ్రగ్స్‌పై వ్యతిరేక పోరాటంలో యువత భాగస్వాములు కావాలి**






**అనంతపురం క్రైమ్ – సూర్య వాస్తవం :** అనంతపురం జేఎన్టీయూ లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ, ఈగల్ ఆంధ్రప్రదేశ్, ఈగల్ క్లబ్ సహకారంతో 'నశా ముక్త్ యువ--వికసిత్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలనే సందేశంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్య క్రమంలో భాగంగా ఆరోగ్య నడక, జాతీయ సంకల్పం, యువత ప్రతిజ్ఞ, సంతకాల కార్యక్రమాలను నిర్వహించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు అవగాహన నినాదాలు చేశారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న జేఎన్టీయూఏ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన్ రావు మాట్లాడుతూ యువత లక్ష్య సాధనపై దృష్టి సారిస్తూ క్రమశిక్షణను పాటించాలని సూచించారు. క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈగల్ ఆంధ్రప్రదేశ్ ఎస్ఐ హనుమంతు మాట్లాడుతూ డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు 1972 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# యాడికిలో ఎల్‌ఈ -3 లైసెన్స్ క్షేత్రస్థాయి పరిశీలన...!

**- స్థలాన్ని పరిశీలించిన జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్**



**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం :** యాడికి గ్రామం, మండలంలోని సర్వే నంబర్ 767/+లోని భూమిని జాయింట్ కలెక్టర్ శ్రీ సి. విష్ణుచరణ్, ఐఏఎస్ గురువారం పరిశీలించారు. ఎల్‌ఈ–3 లైసెన్స్ మంజూరు కోసం దాఖలైన దరఖాస్తుకు సంబంధించి స్థల పరిశీలన నిర్వహించారు.ఈ సందర్భంగా భూమి స్వభావం, విస్తీర్ణం, స్థల పరిస్థితులను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. లైసెన్స్ కోరిన ఉద్దేశానికి భూమి అనుకూలతపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూమికి సంబంధించిన రికార్డులు, సర్వే వివరాలు, ఇతర ఆధార పత్రాలపై సమాచారాన్ని సేకరించారు.అనంతరం సంబంధిత రెవెన్యూ అధికారులకు జాయింట్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. భూమికి సంబంధించిన రికార్డులు, సర్వే వివరాలు, ఆధార పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. ఎల్‌ఈ -3 లైసెన్స్ మంజూరుకు నిర్దేశించిన నిబంధనలు, విధివిధానాలను పూర్తిగా పాటిస్తూ దరఖాస్తును పరిశీలించి, నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు.

# బూదిగుమ్మ బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలి

**- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పయ్యావుల కేశవ్**

**- నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం**




**బెళుగుప్ప– సూర్య వాస్తవం:** బూదిగుమ్మ వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచి, ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. గురువారం బెళుగుప్ప మండలంలోని బూదిగుమ్మ వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి మంత్రి వివరాలు తెలుసుకున్నారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, తదుపరి చేపట్టాల్సిన నిర్మాణ ప్రక్రియపై అధికారులతో చర్చించారు. నిర్మాణ పనుల్లో ఎక్కడైనా జాప్యం జరుగుతుందా? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్న మంత్రి.. పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని సూచించారు.

**నాణ్యతలో రాజీ వద్దు**

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. పనుల వేగంతో పాటు నిర్మాణ నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. వర్షాలు కురిసే సమయంలో నిర్మాణ పనుల కారణంగా ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనులను సమన్వయంతో నిర్వహించి, అవసరమైన చోట సాంకేతిక చర్యలు తీసుకోవాలని సూచించారు.

**గ్రామాల రవాణాకు కీలకం**

బూదిగుమ్మ వద్ద బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. వర్షాకాలంలో రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు గ్రామాల మధ్య రవాణా సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**స్థానికుల సమస్యలపై స్పందన**

ఈ సందర్భంగా బూదిగుమ్మతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన స్థానికులు తమ సమస్యలను మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సావధానంగా విన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిశీలించి, సాధ్యమైన మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని మంత్రి సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్మాణ ప్రాంతంలో అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, బెలుగుప్ప జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున తగ్గిపర్తి రాధాకృష్ణ స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శిల్పారామాన్ని కాపాడుకోవాల్సిన... బాధ్యత మనందరిదీ...!

**- నీటి కొరత.. పాడైన మ్యూజికల్ ఫౌంటెన్.. సమస్యల్లో శిల్పారామం**

**- శిల్పారామం అభివృద్ధిలో ప్రజలు, అధికారులు, దాతలది కీలక పాత్ర**

**- ప్రజలు మీడియా దాతల సేవలను గుర్తించి గౌరవించాలి: వైకుంఠం ప్రభాకర్ చౌదరి**





**అనంతపురం – సూర్య వాస్తవం :** సమాజంలో కృతజ్ఞతా భావం క్రమంగా తగ్గిపోతున్న నేపథ్యంలో, ప్రజల కోసం సేవ చేసిన వ్యక్తులు, అధికారులు, వ్యాపారవేత్తలు, దాతలు, మీడియా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని మాజీ ప్రజాప్రతినిధి వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. శిల్పారామంలో నిర్వహించిన "గ్రాటిట్యూడ్ ట్రిబ్యూట్ టు ది పీపుల్ ఆఫ్ అనంతపురం అండ్ ప్రెస్" కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.తాను ప్రజలకు, మీడియాకు, శిల్పారామం అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉన్నానని తెలిపారు. 1995లో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో నగర అభివృద్ధికి నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజల భాగస్వామ్యంతో అనేక కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.

**9 నెలల్లో నేషనల్ పార్క్ నిర్మాణం**

1995 డిసెంబర్ 18న నేషనల్ పార్క్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు ప్రభాకర్ చౌదరి తెలిపారు. నగర పరిసరాల్లో 100 ఎకరాల స్థలం కోసం అన్వేషించిన సమయంలో సోమలదొడ్డి సమీపంలో ప్రభుత్వ భూమిని గుర్తించి, అప్పటి కలెక్టర్ సుందర్‌కుమార్ సహకారంతో 72 ఎకరాల భూమిని మున్సిపాలిటీ ఆధీనంలోకి తీసుకున్నట్లు చెప్పారు. పార్కు నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు అవసరమవుతాయని అధికారులు చెప్పినప్పటికీ, ప్రజల భాగస్వామ్యంతో పనులు చేపట్టాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం చేయడంతో పాటు పనివారికి భోజనం, యంత్రాలు, రవాణా సౌకర్యాలు అందించారని పేర్కొన్నారు. వేలాది మంది ప్రజలు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు కలిసి పనిచేయడంతో తొమ్మిది నెలల్లో పార్కు నిర్మాణం పూర్తయిందని వివరించారు.

**శిల్పారామం అభివృద్ధిలో ఎందరో భాగస్వామ్యం**

తదుపరి కాలంలో పార్కు శిల్పారామంగా రూపాంతరం చెందిందని, వివిధ రంగాలకు చెందిన దాతలు, అధికారులు, ప్రజలు అందించిన సహకారం వల్లే ఇది అభివృద్ధి చెందిందని అన్నారు. రామోజీరావు సూచనలతో ఈనాడు సిబ్బంది కూడా పార్కు అభివృద్ధిలో భాగస్వాములయ్యారని గుర్తు చేశారు. అటవీ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది సహకారంతో బొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిల్పారామం కోసం కష్టపడిన కార్మికులు, ఉద్యోగులు, దాతలు, వ్యాపారవేత్తలు, ప్రజలను గుర్తు చేసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానన్నారు.

**30 ఏళ్ల సందర్భంగా సన్మానాలు**

నేషనల్ పార్క్ ప్రారంభించి 30 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా, అప్పట్లో శ్రమదానంలో పాల్గొన్న వారందరినీ గుర్తించి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రభాకర్ చౌదరి తెలిపారు. 10 వేల నుంచి 15 వేల మందితో సహపంక్తి భోజనం, అనంతరం అప్పట్లో పార్కు నిర్మాణంలో భాగస్వాములైన వ్యక్తులను సన్మానించే కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అప్పటి దాతలు జీవించి ఉంటే వారిని, లేకుంటే వారి కుటుంబ సభ్యులను గౌరవిస్తామని తెలిపారు. వివిధ సంస్థలు, బిల్డర్స్ అసోసియేషన్ తదితరులు కూడా కార్యక్రమానికి సహకరించేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు.

**శిల్పారామాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదీ**

ప్రస్తుతం శిల్పారామం పలు సమస్యలను ఎదుర్కొంటోందని ప్రభాకర్ చౌదరి తెలిపారు. నీటి కొరత కారణంగా చెట్లు ఎండిపోతున్నాయని, మ్యూజికల్ ఫౌంటెన్ పనిచేయడం లేదని పేర్కొన్నారు. సరైన రక్షణ, నిర్వహణ లేకపోవడంతో కొంతమంది ప్రాంగణంలోకి వచ్చి పరిసరాలను, అక్కడి కళాకృతులను దెబ్బతీస్తున్నారని అన్నారు.

శిల్పారామం అన్యాక్రాంతం కాకుండా గతంలో తాను న్యాయపోరాటం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కూడా శిల్పారామం సమస్యలను మీడియా ప్రతినిధులతో కలిసి పరిశీలించి, జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. శిల్పారామాన్ని కాపాడుకోవడం నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా, దాతలు అందరి బాధ్యత అని పేర్కొంటూ.. ప్రభుత్వం తక్షణమే స్పందించి శిల్పారామం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రభాకర్ చౌదరి కోరారు.

# సంఘ సంస్కర్త రఘుపతి వెంకట రత్నం నాయుడు జయంతి

**- వృద్ధుల దినోత్సవ సంబరాలు**




**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి పట్టణంలో ని ఫుట్బా ల్ మైదానంలో రాష్ట్ర ప్రభు త్వ పెన్షనర్ల భవనంలో కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు, సెక్రెటరీ రామ్ మోహన్ ఆధ్వర్యంలో రఘుపతి వెంకట రత్నము నాయుడు, వృద్ధుల దినోత్సవం సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, వెంకట సుబ్బమ్మ రఘుపతి వెంకట రత్నం నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఈశ్వరమ్మ,వెంకట సుబ్బమ్మ ఇద్దరు కేక్ కట్ చేసి ఒకరినొకరు కేక్ తిని పించుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. విజయ లక్ష్మి మాట్లాడుతూ రఘు పతి వెంకటరత్నం నాయు డు విద్యా వేత్తగా సంఘ సంస్కర్త గా,పవిత్రకు సంకే తంగా, బ్రహ్మర్షిగా, భారత దేశంలోని తెలుగు ప్రాంతా ల్లో పేరు పొందిన వ్యక్తి. సంఘ సమస్కరణోద్యమం మన్నా బ్రహ్మ సుమాజం అన్నా గుర్తుకు వచ్చే పేరు కందుకూరి వీరేశలింగం పంతులు తో పాటు రఘు పతి వెంకట రత్నం నాయుడుదే చెప్పారు.వృద్ధులు అంటే భారత దేశంలో,అరవై లేదా, అంత కంటే ఎక్కువ వయ స్సు ఉన్న వ్యక్తులను, (సీనియర్ సిటీజన్లు) అని అంటా రు.వీరు దశాబ్దాలుగా జీవిస్తున్న జీవితం నుంచి ఎంతో జ్ఞానాన్ని, అనుభవాలతో ఎంతో దోహద పడుతుందని కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు,సెక్రట రీ రామ్ మోహన్, విజయ లక్ష్మి, ఈశ్వరమ్మ, వెంకట సుబ్బమ్మ, కృష్ణ వేణి, శకుంతలమ్మ, దుర్గమ్మ, షైక్షా వలి, నారాయణరెడ్డి, గోవిం దప్ప,లక్ష్మి నారాయణ రెడ్డి, నారాయణ శెట్టి, శామ్యూ ల్,స్వామి దాస్,హస్సన్ అహమ్మద్, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.

# పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా.. లబ్ధిదారుల చేతికి పెన్షన్లు...!

**- లబ్ధిదారులతో మమేకమై సంక్షేమ పథకాలపై ఆరా తీసిన మంత్రి**
**- ఎం.ఎం.హాళ్లిలో పెన్షన్ల పంపిణీ చేసిన మంత్రి పయ్యావుల కేశవ్**



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** నియోజకవర్గం కూడేరు మండలం ఎం.ఎం.హాళ్లి గ్రామంలో 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా పెన్షన్ లబ్ధిదారులతో మంత్రి మమేకమై వారి కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన 61.80 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.2,692.34 కోట్లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో ప్రభుత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పెన్షన్లు కేవలం ఆర్థిక సహాయంగా కాకుండా పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలు ఆత్మగౌరవంతో జీవించేందుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా, పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను చేరవేసి, వారి కష్టాల్లో తోడుగా నిలవడమే 'పేదల సేవలో' కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు.

## కోనేపల్లిలో భూమిపూజ చేసిన ఎమ్మెల్యే జయరాం

**- అభివృద్ధి మాధ్యేయమంటున్న కూటమి ప్రభుత్వం**





**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం పల్లెపండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా పామిడి మండలంలోని కోనేపల్లి గ్రామం నందు విబి -జి రామ్ జి పథకం కింద 15లక్షల రూపాయల నిధులతో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈసందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ పల్లెపండుగ 3.0 కింద రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి.నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యంంత్రి పవన్ కళ్యాణ్ లు11,085 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారని, ఒకప్పుడు బ్లీచింగ్ పౌడర్ కొనలేని పరిస్థితి నుండి ఇప్పుడు తమ గ్రామానికి ఏం కావాలో వాళ్ళే నిర్ణయం తీసుకునే స్థాయికి వచ్చారని తెలిపారు, కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని,చేతల ప్రభుత్వం అన్నారు.ఈకార్యక్రమంలో ఎమ్మార్వో షర్మిల. ఎంపీడీవో ప్రభాకర్,డిప్యూటీ ఎంపీడీఓలు రంగనాయకులు రంగనాయకులు, అశ్వర్థ నాయుడు, విద్యుత్ శాఖ అధికారి మధుసూదనరావు, ఏపీవో ఆదినారాయణమ్మ, బొల్లు శ్రీనివాసరెడ్డి బొమ్మా మోహన, జింకలసంజీవ, హిమబిందు, ఓబులయ్య, కిష్టయ్య,రాజు రామంజి, రాజశేఖర్ గౌడ్ పామిడి పట్టణం, మండల కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 36 ఏళ్లకు పైగా పోలీసు సేవలు..

**- ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రారెడ్డికి ఘన వీడ్కోలు...!**
**- కానిస్టేబుల్‌గా చేరి ఎస్సైగా పదవీ విరమణ**
**- అంకితభావంతో అందించిన సేవలను అభినందించిన ఎస్పీ**
**- జిల్లా ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా శాలువా, జ్ఞాపికతో సత్కారం**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** పోలీసు శాఖలో 36 ఏళ్లకు పైగా అంకితభావంతో సేవలందించి పదవీ విరమణ పొందిన అనంతపురం ట్రాఫిక్ ఎస్సై రామచంద్రారెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు.రామచంద్రారెడ్డి 1990 జూలై 31న కానిస్టేబుల్‌గా పోలీసు శాఖలో చేరి వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. తన సర్వీసులో నాలుగు ప్రశంసా పత్రాలు, 20 గుడ్ సర్వీస్ ఎంట్రీలు, 15 నగదు రివార్డులు అందుకున్నారు. హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐగా పదోన్నతులు పొందిన అనంతరం ఎస్సైగా బాధ్యతలు నిర్వహించారు. అనంతపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ పి. జగదీష్ ఆయన అందించిన సేవలను అభినందించారు. పోలీసు శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించిన రామచంద్రారెడ్డి సేవలను ప్రశంసిస్తూ, పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.పోలీసు శాఖకు రామచంద్రారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని అధికారులు పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం.. అభివృద్ధికి ప్రాధాన్యం...!

**- మారుతినగర్‌లో పింఛన్ల పంపిణీ..**
**రూ.72.91 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం**
**- నగర అభివృద్ధికి మరింత ప్రాధాన్యత:**
**ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్**
**- చంద్రబాబు సహకారంతో మరిన్ని అభివృద్ధి**
**కార్యక్రమాలు : ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని మారుతినగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.మారుతినగర్ 3వ క్రాస్‌లో రూ.24.52 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. అలాగే విజేత మార్ట్ సమీపంలో రూ.48.39 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. మొత్తం రూ.72.91 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహకారంతో అనంతపురం నగరంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.




### 60వ ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ

అనంతరం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన 60వ ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.స్థానిక సమస్యలు, మౌలిక వసతులు, రెవెన్యూ, పింఛన్లు, రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. అందిన అర్జీలను పరిశీలించిన ఎమ్మెల్యే.. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేస్తూ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజా దర్బార్ ఒక వేదికగా ఉపయోగపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

# ప్రజల ఆరోగ్య భద్రతే మా లక్ష్యం...

**- రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తాం....**
**- ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశంలో ఎమ్మెల్యే కాలవ..**




**రాయదుర్గం - సూర్య వాస్తవం:** రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలను విస్తృతపరచి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు నిలిచిపోయిన భవన నిర్మాణ పనులను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించినట్లు తెలిపారు. ప్రస్తుతం రోజూవారి ఆసుపత్రికి సుమారు 400 మంది ఔట్ పేషెంట్లు వస్తున్నారని, డిసెంబర్ నాటికి ఈ సంఖ్యను 700కు పెంచేలా వైద్య సేవలను విస్తృతం చేయాలని సూచించారు. మెరుగైన వైద్య సేవలను సమర్థవంతంగా అందించగలిగితే ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య తప్పకుండా పెరుగుతుందన్నారు. ముఖ్యంగా ఆసుపత్రిలో ఆపరేషన్లు, ప్రసవాలు తక్కువ సంఖ్యలో జరుగుతున్నాయని, వీటిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే అధిక ఖర్చులతో పాటు అనేక వ్యయప్రయాసలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అవసరమైన సంఖ్యలో వైద్యులు అందుబాటులో లేకపోవడం కూడా ఆసుపత్రిలో ఒక ప్రధాన సమస్యగా ఉందన్నారు. ఇతర ప్రాంతాల నుండి వైద్యులు రాయదుర్గం రావడానికి అయిష్టత చూపుతున్నారన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్యులకు అవకాశం కల్పించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా జనరల్ ఫిజీషియన్, అనస్థీషియా వైద్యులు, ఎంబీబీఎస్ వైద్యులతో కలిపి ఐదుగురు వైద్యుల పోస్టులను భర్తీ చేయిస్తే వైద్య సేవలు కొంతైనా మెరుగు పడతాయన్నారు. ఈ విషయంపై మరోసారి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రిని కలిసి విన్నవిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్య క్రమంలో ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు జయంతి సురేష్, కొండాపురం శ్రీనివాసులు, సంపత్ కుమారి, కళ్యాణ్ చక్రవర్తి,తదితరులు పాల్గొన్నారు.



# వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత కల్పించడం...ప్రతి ఒక్కరి బాధ్యత...!

**- వయోవృద్ధులకు పింఛన్లు, బెడ్‌షీట్లు, వస్త్రాల పంపిణీ**
**- వృద్ధాశ్రమానికి దాతల సహకారం అభినందనీయమన్న ఎంపీ**
**- వయోవృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ**



**అనంతపురం - సూర్య వాస్తవం :** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అనంతపురం రాజు రోడ్డులోని వైశ్య హాస్టల్ కాంపౌండ్‌లో ఉన్న శ్రీ వాసవీ వృద్ధాశ్రమాన్ని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులను ఆత్మీయంగా కలిశారు. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని, తన చేతుల మీదుగా పింఛన్లను పంపిణీ చేశారు.దాతల సహకారంతో వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు అవసరమైన బెడ్‌షీట్లు, వస్త్రాలు తదితర సామగ్రిని అందజేశారు. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సహాయం, ఇతర సేవలను అందిస్తూ వాసవీ వృద్ధాశ్రమం పాలకవర్గం చేస్తున్న సేవలను అభినందించారు.మన పెద్దల అనుభవం, ఆశీస్సులు సమాజానికి ఎంతో విలువైనవని, వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్షులు తలుపుల కృష్ణమూర్తి, ట్రెజరర్ గోపనపల్లి కృష్ణయ్య, జర్నలిస్ట్ ఇటికాల శివ రామాంజనేయులు, అనంతపురం కొత్తూరు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి, అనంతపురం జిల్లా ఏవివోపిఏ కమిటీ సెక్రటరీ జయంతి సత్యారామ్, ఫణి, నర్సేపల్లి నాగభూషణం, కృష్ణయ్య, కృష్ణమూర్తి తదితర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## పోలేరమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి రామనారాయణ రెడ్డి



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** వెంకటగిరి పట్టణంలో గురువారం రాష్ట్ర పండుగగా అత్యంత వైభవంగా జరిగిన వెంకటగిరి గ్రామదేవత శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ పోలేరమ్మకు పట్టు వస్త్రాలను సమర్పించారు. జాతర మహోత్సవంలో పాల్గొన్న ఆయన అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తోపాటు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ,జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్,జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు,ఎండోమెంట్ ఈవో అరవ భూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి పలువురు కమిటీ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.జాతర సందర్భంగా వెంకటగిరి పట్టణం జన సందోహంతో నిండి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.వేలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన "ఏఎంసి చైర్మన్ ఆకుతోట రమేష్"



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో గురువారం పండుగ వాతావరణం నడుమ ఎన్టీఆర్ భరోసా పెంక్షన్లు పంపిణి జరిగింది,మునిసిపల్ కమిషనర్ చిన్నయ్య పర్యవేక్షణ లో జరిగిన ఈ కార్యక్రమం లో భాగంగా స్థానిక బాపూజీ కాలనీ గిరిజన కాలనీ లో జరిగిన ఎన్టీఆర్ భరోసా పెంక్షన్లు పంపిణి కాలేయక్రమం లో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆకుతోట రమేష్ పాల్గొని ఆయన చేతులు మీదుగా వృద్దులకు పెంక్షన్లు పంపిణి చేయడం జరిగింది,పెంక్షన్లు చేతికి అందగానే వృద్దుల ముఖాలలో చిరునవ్వు,ఆనందం మిన్నంటింది,ఈ కార్యక్రమం లో ఎఫ్ ఎస్ సి ఎస్ చైర్మన్ ఏజి కిషోర్ , తెలుగుదేశం పార్టీ కి చెందిన ఇవి సురేష్,వల్లూరు శ్యామ్,కుదిరి పెంచలయ్య,చరణ్ యాదవ్.పి శ్రీనివాసులు.శంకరయ్య గౌడ్.శ్రీనివాసులు రెడ్డి.సెట్ రాజా.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్"పులిగోరు"



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** అర్హులైన పేదలందరికీ పార్టీలకు అతీతంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ పులిగోరు మురళీ కృష్ణారెడ్డి చెప్పారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని 22,23,40 డివిజన్లలో పులిగోరు మురళీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ అధ్యక్షుడు నాగ ప్రతాప్,22వ డివిజన్ అధ్యక్షులు గెంజి సుధాకర్ రెడ్డి,23వ డివిజన్ అధ్యక్షులు దేవాచారి, గణేష్,సూర్యనారాయణ రెడ్డి,22వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షులు మోహన్,ఎస్ కే డి నగర్ విజయ్, శంకర్,రాజా కన్నయ్య పాల్గొన్నారు.

## విద్యార్థులే టీచర్లు..తల్లిదండ్రులే ప్రేక్షకులు!

**-నాయుడుపేట నారాయణ ఈఎం స్కూల్‌లో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్**

**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** నాయుడుపేటలోని నారాయణ ఈఎం స్కూల్‌లో





ఎల్ కేజీ అండ్ యూకేజీ విద్యార్థుల కోసం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (ఎస్ ఎల్ సి) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చిన్నారులే ఉపాధ్యా యులుగా మారి,తరగతి గదిలో తాము నేర్చుకున్న అక్షరాలు,సంఖ్యలు, పదాలు, కాన్సెప్ట్స్, సృజనాత్మక కార్యకలాపాలు, వివిధ అభ్యసన అంశాలను తల్లిదండ్రులకు స్వయంగా వివరించారు. ఎంతో ఉత్సాహంగా,ధైర్యంగా తమ అభ్యసనాన్ని ప్రదర్శి ంచిన చిన్నారుల ఆత్మవిశ్వాసం, చురుకుదనం,కమ్యూనికేషన్ నైపుణ్యాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమాన్ని ఏజీఎం రియాజ్,కోఆర్డినేటర్ శ్రీమతి పుష్పలత ఏఓ గౌస్ భాషా సందర్శించి విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలించి చిన్నారులను అభినందించారు.వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి విజిత కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ విద్యార్థులు,ఉపాధ్యాయులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున మాట్లాడుతూ,చిన్న వయస్సు నుంచే విద్యార్థులు తాము నేర్చుకున్న విషయాలను స్వయంగా వ్యక్తీకరించే అవకాశాలను కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం,సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మరియు స్వతంత్ర అభ్యసన సామర్థ్యం పెంపొందుతాయని తెలిపారు.తమ పిల్లలు నేర్చుకున్న విషయాలను స్వయంగా వివరించడం చూసి తల్లిదండ్రులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.చిన్నారుల అద్భుతమైన ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించిన తల్లిదండ్రులు విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను అభినందిస్తూ,ఎస్ ఎల్ సి కార్యక్రమాన్ని ప్రశంసించారు."నేర్చుకున్నది చెప్పడం కాదు...స్వయంగా చేసి చూపించడం"అనే భావనకు ఈ స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ చక్కని ఉదాహరణగా నిలిచింది.

## అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు..

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ
- రూ 226 కోట్లతో కేపీ కెనాల్ తాగునీటి ప్రాజెక్ట్ పనులు
- లబ్ధిదారులకు స్వయంగా"ఎన్టీఆర్‌భరోసా" పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే విజయశ్రీ
- పేట సమగ్ర అభివృద్ధే ధ్యేయం.. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



**దొరవారిసత్రం– సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణ సమగ్ర అభివృద్ధితో పాటు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు.గురువారం నాయుడు పేట పట్టణంలోని అగ్రహారపేట,అరుంధతీవాడ మాతమ్మ గుడి వద్ద ప్రారంభమైన భారీ ర్యాలీ స్థానిక హరిజనవాడ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే లబ్ధిదారులకు స్వయంగా" ఎన్టీఆర్ భరోసా" పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించారు.రాబోయే రెండేళ్ల వ్యవధిలో నాయుడుపేట పట్టణ రూపురేఖలు మారుసామన్నారు. వెంకటగిరి రోడ్డులోని స్వర్ణముఖి నది వరకు రోడ్డు డివైడర్లు,అత్యాధునిక సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి పట్టణాన్ని సుందరీకరిస్తామని చెప్పారు.226 కోట్లతో తాగునీటి ప్రాజెక్ట్ పట్టణ ప్రజల శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు రూ 226 కోట్ల అంచనా వ్యయంతో కేపీ తెలుగుగంగ కెనాల్ అనుసంధాన ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజల దాహార్తిని తీరుస్తామని వెల్లడించారు.పేద ప్రజలందరూ టిడ్కో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.నియోజకవర్గంలో 90 శాతానికి పైగా అర్హులైన వారికి మూడు దశల్లో నూతన పింఛన్లను మంజూరు చేసి న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి,వారికి సంక్షేమ పథకాలు దక్కేలా రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో గళమెత్తుతానని చెప్పారు.అంతేకాకుండా అర్హులైన నిరుపేద కార్మికులకు అన్నా చెరువు వద్ద ఇళ్ల పట్టాలు మంజూరయ్యేలా చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి చారిత్రాత్మక హామీలను సమర్థవంతంగా అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి బాటలు వేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం స్థానిక మరియు ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు, కార్యకర్తలు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## వెంకటగిరి పోలేరమ్మ జాతర బందోబస్తును పరిశీలించిన జిల్లా ఎస్పీ

- అమ్మవారి ఆలయం,ఊరేగింపు మార్గాల్లో భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా ఎస్పీ
- భారీగా తరలివస్తున్న భక్తులకు అనుగుణంగా విస్తృత బందోబస్తు పూర్తి అప్రమత్తతకు ఆదేశాలు.
- సీసీ కెమెరాలు,డ్రోన్లు,కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ.జాతర ముగింపు వరకు పూర్తి అప్రమత్తత
- అత్యవసర పరిస్థితుల్లో డయల్-- 112 ద్వారా తక్షణ పోలీసు సహాయం



**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** వేంకటగిరి శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర ముగింపు కార్యక్రమాల సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్న నేపథ్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, గురువారం వెంకటగిరిలోని అమ్మవారి ఆలయాన్ని సందర్శించి బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు,భక్తుల రద్దీ నియంత్రణ చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అమ్మవారి ఆలయం పరిసరాలు,భక్తుల రాకపోకలు, క్యూలైన్లు, ప్రవేశ--నిష్క్రమణ ప్రాంతాలు,ఊరేగింపు మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు తదితర ఏర్పాట్లను



జిల్లా ఎస్పీ పరిశీలించారు.భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బందిని మోహరించి,ట్రాఫిక్ మరియు క్యూలైన్లను క్రమబద్ధీకరించాలని అధికారులను ఆదేశించారు.జాతర ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును జిల్లా ఎస్పీ పరిశీలించారు.కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా ఆలయ పరిసరాలు,ప్రధాన రద్దీ ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కడైనా రద్దీ లేదా అనుమానాస్పద పరిస్థితి గుర్తించిన వెంటనే సంబంధిత సిబ్బంది స్పందించేలా సమన్వయం ఉండాలని ఆదేశించారు.డ్రోన్ల ద్వారా కూడా జాతర ప్రాంతంపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు.జాతర ముగింపు కార్యక్రమాలు పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సహా భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని, భక్తులతో మర్యాదగా వ్యవహరిస్తూ చట్టవ్యతిరేక, అను మానాస్పద కార్యకలాపాలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితులు, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు,భద్రతకు సంబంధించిన సమ స్యలు ఎదురైతే ప్రజలు వెంటనే డయల్--112 కు సమా చారం అందించాలని జిల్లా పోలీస్ శాఖ సూచించింది. జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు ,సిబ్బంది మరియు ఇతర శాఖలతో సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోలీస్ శాఖ తెలిపింది. భక్తులందరూ పోలీసు సిబ్బందికి సహకరిస్తూ, క్రమశిక్షణతో క్యూలైన్లు పాటించి జాతరను ప్రశాంతంగా ముగించేందుకు సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## పాఠశాలకు 15 సీలింగ్ ఫ్యాన్లు వితరణ...

**-విద్యారంగానికి ప్రాధాన్యమిస్తూ సేవా కార్యక్రమాలు...786 సేవా సంఘం వ్యవస్థాపకులు 786 రఫీ**

**-పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి: దాతలు అరగొండ జయరామ్-రేవతి దంపతులకు సత్కారం**

**దొరవారిసత్రం –సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినుల వసతి,సౌకర్యార్థం 786 సేవా సంఘం ఆధ్వర్యంలో 15 సీలింగ్ ఫ్యాన్లను బహూకరించారు. పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు,సేవా సంఘం సభ్యులైన అరగొండ జయరామ్-రేవతి దంపతులు తమ సొంత నిధులతో ఈ ఫ్యాన్లను పాఠశాలకు వితరణగా సమకూర్చారు.786 సేవా సంఘం వ్యవస్థాపకులు షేక్ రఫీ అధ్యక్షతన, మండల విద్యాశాఖాధికారి బానాల మునిరత్నం సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాతలు అరగొండ జయరామ్ దంపతులు,పాఠశాల ప్రధానోపాధ్యాయిని వరకుమారితో పాటు ఉపాధ్యాయులకు ఫ్యాన్లను అందజేశారు.ఈ సందర్భంగా 786 సేవా సంఘం వ్యవస్థాపకులు షేక్ రఫీ మాట్లాడుతూ తమ సంస్థ ఎల్లప్పుడూ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పేద విద్యార్థులకు



చేయూతనందిస్తోందన్నారు.గతంలో పాఠశాల విద్యార్థినులకు స్టీల్ ప్లేట్లు,గ్లాసులు పంపిణీ చేసిన సమయంలో ఫ్యాన్లు ఇస్తామని మాట ఇచ్చిన జయరామ్-రేవతి దంపతులు,ఇచ్చిన మాట ప్రకారం ఫ్యాన్లను సమకూర్చడం అభినందనీయమన్నారు సూళ్లూరుపేట నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ సూచనలు,ప్రోత్సాహంతో పాఠశాలలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.అనంతరం దాతలను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఎంఈఓ బానాల మునిరత్నం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి,పేద విద్యార్థుల అవసరాలకు ఎల్లప్పుడూ ముందుండి సహాయ సహకారాలు అందిస్తున్న 786 రఫీ మరియు దాతల సేవలను కొనియాడారు.కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వరకుమారి, ఉపాధ్యాయులు,నాయకులు అవధానం సుధీర్, నిత్య కృష్ణారెడ్డి,వెంకీ,బబిత,ధనక్క,హైమావతమ్మ, ఎస్ఎంసీ చైర్మన్,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ‘ది కోర్ట్’ (జియో హాట్ స్టార్) సిరీస్ రివ్యూ!

యోగలక్ష్మికి సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ ఉంది. ‘టూరిస్ట్ ఫ్యామిలీ’ సినిమా .. ‘హార్ట్ బీట్’ సిరీస్ లో ఆమె చేసిన పాత్రలు అందుకు కారణంగా చెప్పుకోవచ్చు. ‘హార్ట్ బీట్’లో యోగలక్ష్మి చేసింది నెగెటివ్ షేడ్స్ తో కూడిన పాత్ర. అయినప్పటికీ ఆకర్షణీయమైన ఆమె కళ్లు అందరినీ కట్టిపడేశాయి. అలాంటి యోగలక్ష్మి ప్రధానమైన పాత్రగా రూపొందిన సిరీస్ గా ‘ది కోర్ట్’ కనిపిస్తుంది. తమిళంలో రూపొందిన ఈ సిరీస్ నుంచి ఇంతవరకూ 16 ఎపిసోడ్స్ ను వదిలారు. తెలుగులోను అందుబాటులో ఉన్నాయి. ‘యాలిని’ (యోగలక్ష్మి) ‘లా’ పూర్తి చేస్తుంది. సిటీకి చేరుకుని అక్కడ తన స్నేహితులు ఉండే పీజీలో దిగుతుంది. హైకోర్టులో జూనియర్ గా అవకాశాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నాలు మొదలెడుతుంది. ‘బార్’ ఎలక్షన్స్ దగ్గర పడటంతో, హై కోర్టులో సీనియర్ న్యాయవాదుల మధ్య కోల్డ్ వార్ నడుస్తూ ఉంటుంది. ఈ నేపథ్యంలోనే తనకి ఛాంబర్ లేకుండా చేసిన ‘వేణి చంద్రకాంత్’ (ముక్తా జార్జ్) పై అడ్వకేట్ దేవా ( అర్జున్ శ్యామ్) అసహనంతో ఉంటాడు. ఆమె ఛాంబర్ ను షేర్ చేసుకోవాలనే పట్టుదలతో ఉంటాడు. ‘వేణి’ ఆ కోర్టులో 15 ఏళ్లుగా అడ్వకేట్ గా పనిచేస్తూ ఉంటుంది. ఆమె దగ్గర ముత్తు .. విశ్వ .. కీర్తన జూనియర్స్ గా ఉంటారు. ఆ కోర్టుకి సంబంధించిన క్యాంటీన్ ను వేణి భర్త ‘సత్య’ నడుపుతూ ఉంటాడు. ఆ కోర్టు ఆవరణలో ఎవరు అడుగుపెట్టినా క్యాంటీన్ నడుపుతున్న సత్యకి .. ‘టీ’లు మోసే ‘సుడాలి’కి తెలిసిపోతుంది. అందువలన ఆ కోర్టు ఆవరణలోకి అడుగుపెట్టిన ‘యాలిని’కి ముందుగా వాళ్లే తారసపడతారు. అలాంటి ఒక తెలివైన అమ్మాయి, వేణికి జూనియర్ గా ఉంటే బాగుంటుందని సత్య భావిస్తాడు. అయితే దేవాకి జూనియర్ గా ‘యాలిని’ చేరిపోతుంది. అప్పటికే దేవాకి ‘దివి’ అనే ఓ పదేళ్ల కూతురు ఉంటుంది. ఆమె తల్లిని గురించి అడిగే సాహసం చేయలేకపోతుంది యాలిని.



ఆమె ధోరణి వేణి జూనియర్స్ ను తీవ్రమైన అసహనానికి గురిచేస్తుంది. సమయం చూసి యాలినిని దెబ్బకొట్టాలని వాళ్లు నిర్ణయించుకుంటారు. అందుకోసం వాళ్లు ఏం చేస్తారు? యాలిని ఎలాంటి పరిణామాలను ఎదుర్కోవలసి వస్తుంది? ఆమె తీసుకునే కేసులు ఎలాంటి సవాళ్లను విసురుతాయి? అనేది మిగతా కథ.

‘జియో హాట్ స్టార్’ నుంచి వచ్చిన ‘హార్ట్ బీట్’ హాస్పిటల్ నేపథ్యంలో .. ఫ్యామిలీ ఎమోషన్స్ తో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఆ తరువాత వచ్చిన సిరీస్ గా ‘ఆఫీస్’ కనిపిస్తుంది. ఒక విలేజ్ నేపథ్యంలో తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ తిరిగే కథతో రూపొందిన ఈ సిరీస్ కూడా ఆడియన్స్ నుంచి మంచి మార్కులు కొట్టేసింది. ఈ నేపథ్యంలో వదిలిన మరో సిరీస్ ‘ది కోర్ట్’. కోర్టు బయట .. లోపల చోటుచేసుకునే సన్నివేశాలతో నడిచే సిరీస్ ఇది.యాలిని కొత్తగా కోర్టు ప్రాంగణంలోకి అడుగుపెట్టడం .. అక్కడి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడం .. తన తెలివి తేటలతో జూనియర్ గా అవకాశాన్ని సంపాదించడం .. సీనియర్స్ మధ్యనున్న స్పర్థలను గమనించడం .. అమాయకంగా ఉంటే తన క్రెడిట్ ను కొట్టేయడానికి అవతలవాళ్లు ఆలోచించరనే విషయాన్ని పసిగట్టడం .. ధైర్యంగా ఆ సమస్యను అధిగమించడం వంటి సన్నివేశాలతో ఈ సిరీస్ ముందుకు వెళుతుంది.ప్రధానమైన పాత్రల సంఖ్య .. అందుకు సంబంధించిన ట్రాకులు చూస్తే, ఇది చాలా భారీ సిరీస్ అనే విషయం అర్థమవుతుంది. అయితే కథను యెత్తుకున్న విధానం .. కొన్ని ఎపిసోడ్స్ వరకూ ఆ పాత్రలను నడిపించిన తీరు సాదాసీదాగానే అనిపిస్తుంది. ఆరంభంలోని ఎపిసోడ్స్ ఫ్యామిలీ ఎమోషన్స్ వైపు వెళ్లని కారణంగా, కోర్టులో కథ అక్కడక్కడే తిరుగుతున్నట్టుగా అనిపిస్తుంది. ఆ సన్నివేశాలు అంత బలంగా అనిపించనూ లేదు. అయితే ‘యాలిని’ పాత్ర వెనుక కూడా బలమైన కథ ఏదో ఉందనే విషయం ప్రేక్షకులకు అర్థమవుతుంది. అలాగే వేణి భర్త క్యాంటీన్ కి ఎందుకు పరిమితమయ్యాడనే ఒక సందేహం తలెత్తుతుంది. ఇక దేవా ఫ్యామిలీ లైఫ్ లోని చిక్కులు ఎలాంటివి అనేది కూడా కుతూహలాన్ని పెంచుతుంది. ఇలా ప్రధానమైన పాత్రలకు సంబంధించిన నేపథ్యాలు ఆడియన్స్ ముందుకు ఇంకా రాలేదు. అలాగే మరికొన్ని కొత్త పాత్రలు కూడా ఎంట్రీ ఇచ్చే అవకాశాలు కూడా పుష్కలంగానే ఉన్నాయి.భారీ తారాగణంతో రూపొందిన ఈ సిరీస్ నుంచి ఇంకా చాలా ఎపిసోడ్స్ రావలసి ఉండొచ్చు. కానీ ఆరంభంలో ఎపిసోడ్స్ ఆ దిశగా నడిపించేవి అయ్యుండాలి. ఒక ఎపిసోడ్ ను మించి మరొక ఎపిసోడ్ ఉత్కంఠను రేకెత్తించాలి. కానీ ఈ సిరీస్ కథ చాలా నిదానంగా .. నింపాదిగా మొదలవడం కాస్త నిరాశను కలిగిస్తుంది. సరైన కేసులు .. యాలిని తన తెలివి తేటలతో వాటిని పరిష్కరించే విధానానికి సంబంధించిన ఇంట్రెస్టింగ్ ఎపిసోడ్స్ త్వరలో పలకరించవచ్చు. అలా కథ పుంజుకుంటే ఈ సిరీస్ కూడా ఒక ‘హార్ట్ బీట్’ .. ‘ ఆఫీస్’ సిరీస్ ల సరసన చేరే ఛాన్స్ ఉంది.

## మమిత పారితోషికం పుకార్లు నిజమేనా?



కేరళ కుట్టి మమిత బైజు ప్రస్తుతం టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీ అనడంలో సందేహం లేదు. ఇటీవల ఆమె నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, బెత్లెహెం కుటుంబ యూనిట్ సినిమాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ముఖ్యంగా మలయాళ మూవీ బెత్లెహెం కుటుంబ యూనిట్ ఏకంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించినట్లుగా వార్తలు వస్తున్నాయి. ఓటీటీలోనూ సినిమా గురించి చర్చ జరుగుతోంది. సినిమాలో ఆమె పాత్రపై ప్రశంసలు కురుస్తున్నాయి. అంతకు ముందు వచ్చిన విశ్వనాథ్ అండ్ సన్స్‌లో మమిత యాక్టింగ్‌కి తెలుగు ప్రేక్షకులు ఫిదా అయ్యారు. అప్పుడెప్పుడో బొమ్మరిల్లు సినిమాలో హాసిని ని చూశాం, మళ్లీ ఇప్పుడు విశ్వనాథ్ అండ్ సన్స్ సినిమాలో మ్యాడీని చూశాం అనే కామెంట్స్ వినిపించాయి. చాలా యాక్టివ్ అమ్మాయి పాత్రల్లో మమిత బైజు నటిస్తే ఆ పాత్రకే గుర్తింపు తీసుకు వస్తుందని విశ్లేషకులు అంటున్నారు. మమిత బైజు పారితోషికం రూమర్స్... సాధారణంగా ఏ హీరో అయినా ఏ హీరోయిన్ అయినా ఈ స్థాయిలో గుర్తింపు, బ్యాక్ టు బ్యాక్ కమర్షియల్ బ్లాక్ బస్టర్ హిట్స్ పడితే ఆగుతారా... పారితోషికం పెంచేస్తారు. అందరిలాగే మమిత బైజు తన పారితోషికంను పెంచేసింది అంటూ మలయాళం మీడియాలో కథనాలు వచ్చాయి.

ఆ మధ్య తెలుగు మీడియాలోనూ ఒక టాలీవుడ్ మూవీ కోసం మమిత బైజు భారీ పారితోషికం డిమాండ్ చేసింది అంటూ వార్తలు వచ్చాయి. తమిళ్‌లోనూ ఈమె పారితోషికం గురించి కథనాలు వచ్చినట్లు సమాచారం. మీడియం రేంజ్ నిర్మాతలకు అందనంత ఎత్తులో మమిత బైజు నిల్చుందని, ఆమెను అందు కోవాలంటే పెద్ద నిర్మాతలు, పెద్ద హీరోలకు మాత్రమే సాధ్యం అన్నట్లుగా మమిత గురించి పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ అవన్నీ వాస్తవం కాదని, మీడియాలో వస్తున్న మమిత పారితోషికం వార్తలు కేవలం పుకార్లే అని ఆమె సన్నిహితులు చెబుతున్నారు.

## నేడు రిలీజ్ అవుతున్న ఎనిమిది సినిమాలు ఇవే!

నేడు థియేటర్ల దగ్గర కాస్త గట్టిగానే సందడి కనిపించేలా ఉంది. సాధారణంగా ఫ్రైడే వస్తే ఒకటి రెండు పెద్ద సినిమాలు రిలీజ్ అవుతూ ఉంటాయి. లేదంటే రెండు మూడు చిన్న సినిమాలు ప్రేక్షకుల ముందుకు వస్తుంటాయి. అయితే ఈ శుక్రవారం 8 సినిమాల వరకూ థియేటర్లలో దిగిపోవడానికి సిద్ధమయ్యాయి. వాటిలో ఒకటిగా ‘డోంట్ ట్రబుల్ ది ట్రబుల్’ కనిపిస్తోంది. ఆర్కా మీడియా బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్ లీడ్ రోల్ చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్ ఒక రేంజ్ లో ఉండటంతో, సహజంగానే ఆడియన్స్ లో అంచనాలు ఉన్నాయి. సందీప్ కిషన్ ‘సిగ్మా’ కూడా నేడు భారీస్థాయిలో విడుదలవుతోంది. హీరో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో, ఫరియా అబ్దుల్లా కథానాయికగా అలరించనుంది.




తమన్ సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన బలంగా నిలవనుందనే టాక్ బలంగా వినిపిస్తోంది. ఇక హర్ష్ రోషన్ – నక్షత్ర జంటగా నటించిన లవ్ స్టోరీగా ‘తెల్లకాగితం’ రూపొందిన సంగతి తెలిసిందే. కృష్ణ కొమ్మలపాటి నిర్మించిన ఈ సినిమాకి ‘నందు’ దర్శకత్వం వహించాడు. యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందించిన సినిమా ఇది.



# 2027 వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల..

# అక్టోబర్ 10న భారత్-పాక్ హైవోల్టేజ్ మ్యాచ్

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ పురుషుల క్రికెట్ వన్డే ప్రపంచకప్ 2027 షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) గురువారం విడుదల చేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నమెంట్ సరికొత్త ఫార్మాట్‌తో అభిమానులను అలరించనుంది. 2023 ఫైనల్‌కు పునరావృతంగా, అక్టోబర్ 7న కేప్‌టౌన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాతో భారత్ తన తొలి మ్యాచ్ ఆడనుంది.ఈ టోర్నమెంట్‌లో మొత్తం 14 జట్లు పాల్గొంటాయి. అయితే, గ్రూప్ స్టేజ్‌కు మాత్రం 12 జట్లే అర్హత సాధిస్తాయి. ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా అర్హత పొందాయి. వీటితో పాటు, 2026 సెప్టెంబర్ 30 నాటికి ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచిన జట్లు కూడా నేరుగా క్వాలిఫై అవుతాయి. దీంతో మొత్తం 10 జట్లు ఖరారవుతాయి. మిగిలిన రెండు స్థానాల కోసం క్వాలిఫయర్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈ క్వాలిఫయర్‌లో గెలిచిన జట్టు నేరుగా గ్రూప్ స్టేజ్‌కు చేరుకుంటుంది. ఇక క్వాలిఫయర్‌లో 2, 3, 4 స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ‘సూపర్ సిరీస్’ జరుగుతుంది. ఈ మూడు జట్ల మధ్య జరిగే రౌండ్ రాబిన్ మ్యాచ్‌ల తర్వాత, అగ్రస్థానంలో నిలిచిన జట్టు గ్రూప్ స్టేజ్‌లో చివరిదైన 12వ జట్టుగా అర్హత సాధిస్తుంది. క్వాలిఫయర్స్‌లో ఓడిపోయిన మిగతా రెండు జట్లు టోర్నీ నుంచి నిష్క్రమిస్తాయి.

### గ్రూప్ స్టేజ్ నుంచి సూపర్ 7 వరకు..

గ్రూప్ స్టేజ్‌లో మొత్తం 12 జట్లను ఆరు చొప్పున రెండు గ్రూపులుగా (గ్రూప్ ఏ, గ్రూప్ బీ) విభజిస్తారు. ప్రతి జట్టు తమ గ్రూపులోని మిగతా ఐదు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. గ్రూప్ దశ ముగిసేసరికి, రెండు గ్రూపులలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు (3ం3=6) నేరుగా తదుపరి దశ అయిన ‘సూపర్ 7’కు అర్హత సాధిస్తాయి.ఇక ఏడో జట్టు ఎంపిక ఆసక్తికరంగా ఉంటుంది. రెండు




గ్రూపుల్లో నాలుగో స్థానంలో నిలిచిన జట్లను పోలుస్తారు. ఈ రెండింటిలో ఏ జట్టుకు ఎక్కువ పాయింట్లు ఉంటే, ఆ జట్టు ఏడో బెర్తును దక్కించుకుంటుంది. పాయింట్లు సమానంగా ఉంటే నెట్ రన్ రేట్ ఆధారంగా నిర్ణయిస్తారు. అంటే, గ్రూపులో నాలుగో స్థానంలో ఉన్నా టోర్నీలో ముందడుగు వేసే అవకాశం ఉంటుంది.

### ఏమిటీ ‘సూపర్ 7’.. ప్రీ-సీడింగ్ అంటే ఏమిటి?

గ్రూప్ దశ ముగిశాక, ప్రతి గ్రూప్‌లోని టాప్-3 జట్లు, నాలుగో స్థానంలో నిలిచి రెండు గ్రూపుల్లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన ఒక జట్టుతో కలిపి మొత్తం ఏడు జట్లు ‘సూపర్ 7’ దశకు చేరుకుంటాయి. ఇదే ఈ వరల్డ్ కప్‌లో సరికొత్త ప్రయోగం. గ్రూప్ స్టేజ్ నుంచి వచ్చిన ఏడు జట్లు ఈ దశలో పోటీపడతాయి. ముఖ్యంగా, గ్రూప్ స్టేజ్‌లో సాధించిన పాయింట్లను ఇక్కడ పరిగణనలోకి తీసుకోరు. ప్రతి జట్టు సున్నా పాయింట్లతో ఈ దశను ప్రారంభిస్తుంది. సూపర్ 7లో ప్రతి జట్టు మిగిలిన ఆరు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది.అభిమానులకు, ప్రసారదారులకు సౌలభ్యం కోసం ఐసీసీ ‘ప్రీ-సీడింగ్’ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని ప్రకారం, కొన్ని అగ్ర జట్లకు ముందుగానే సీడింగ్ కేటాయించారు (ఉదాహరణకు, ఇండియాకు ూ1, ఆస్ట్రేలియాకు ూ2, పాకిస్థాన్‌కు ూ3). ఒకవేళ ఈ జట్లు సూపర్ 7కు అర్హత సాధిస్తే, వారికి కేటాయించిన సీడింగ్ ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయి. ఒకవేళ సీడింగ్ ఉన్న జట్టు అర్హత సాధించలేకపోయి, ఆ స్థానంలో మరో జట్టు (సీడింగ్ లేనిది) వస్తే, ఆ కొత్త జట్టుకు పాత జట్టు సీడింగ్ వర్తిస్తుంది. దీనివల్ల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పులు లేకుండా మ్యాచ్‌లు సజావుగా సాగుతాయి.

### సెమీ-ఫైనల్స్ మరియు ఫైనల్

సూపర్ 7 దశ ముగిసేసరికి పాయింట్ల పట్టికలో టాప్-4లో నిలిచిన జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మొదటి స్థానంలోని జట్టు నాలుగో స్థానంలోని జట్టుతో ఒక సెమీస్ లో, రెండు-మూడు స్థానాల్లోని జట్లు మరో సెమీస్‌లో తలపడతాయి. సెమీ ఫైనల్స్‌లో గెలిచిన రెండు జట్లు ఫైనల్‌లో ప్రపంచ విజేతగా నిలిచేందుకు పోటీపడతాయి. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లకు రిజర్వ్ డే కూడా ఉంటుంది. ఈ కొత్త ఫార్మాట్ టోర్నీకి మరింత ఉత్కంఠను జోడిస్తుందని ఐసీసీ ఆశిస్తోంది.

### కీలక మ్యాచ్‌లు, నాకౌట్ దశ

క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూసే భారత్-పాకిస్థాన్ హై-వోల్టేజ్ మ్యాచ్ అక్టోబర్ 10న జోహన్నెస్‌బర్గ్‌లో జరగనుంది. ఆతిథ్య జట్లైన దక్షిణాఫ్రికా అక్టోబర్ 9న న్యూజిలాండ్‌తో, జింబాబ్వే అక్టోబర్ 11న ఆఫ్ఘనిస్థాన్‌తో తమ ప్రస్థానాన్ని ప్రారంభిస్తాయి.తొలి సెమీఫైనల్ నవంబర్ 17న కేప్‌టౌన్‌లో, రెండో సెమీఫైనల్ నవంబర్ 18న ష్వానేలో జరుగుతాయి. ఇక, విశ్వవిజేతను తేల్చే ఫైనల్ మ్యాచ్ నవంబర్ 21న జోహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ స్టేడియంలో జరగనుంది. సెమీస్, ఫైనల్స్‌కు రిజర్వ్ డేలను కూడా కేటాయించారు.ఈ షెడ్యూల్ ప్రకటనపై ఐసీసీ ఛైర్మన్ జై షా మాట్లాడుతూ, “ఈ షెడ్యూల్ ప్రకటన, టికెట్ల కేటాయింపు ప్రారంభం కావడం టోర్నమెంట్ సన్నాహాల్లో కీలక మైలురాళ్లు. మూడు దేశాలు క్రికెట్ అభిమానులకు అద్భుతమైన అనుభూతిని అందిస్తాయని ఆశిస్తున్నాం,” అని తెలిపారు.



## 2027 వరల్డ్ కప్: తన భవిష్యత్ ప్రణాళికలపై క్లారిటీ ఇచ్చిన రోహిత్ శర్మ

టీమిండియా సీనియర్ ఓపెనర్, మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ తన భవిష్యత్ ప్రణాళికలపై పూర్తి స్పష్టత ఇచ్చాడు. 2027లో జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో ఆడాలనే తన దీర్ఘకాలిక ఆశయాన్ని బయటపెట్టాడు. అయితే, సుదీర్ఘ లక్ష్యాల గురించి ఎక్కువగా ఆలోచించకుండా, వర్తమానంపై దృష్టి సారించి, ఫిట్‌గా ఉంటూ, నిలకడగా రాణించడమే తన వ్యూహమని పేర్కొన్నాడు. ఇటీవల గౌహతిలో వెస్టిండీస్‌తో జరిగిన వన్డేలో రోహిత్ (101) అద్భుత శతకంతో ఫామ్‌లోకి వచ్చిన విషయం తెలిసిందే.జియోస్టార్, స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రోహిత్ మాట్లాడుతూ, “2027 వరకు నన్ను నేను సమర్థుడిగా ఉంచుకోవాలనుకుంటున్నాను. అందుకోసం ఫిట్‌గా ఉండాలి, కష్టపడాలి, ప్రతీ టోర్నమెంట్‌లోనూ రాణించాలి. ప్రస్తుతం నా ముందున్న మ్యాచ్‌లపై దృష్టి పెడితేనే ముందుకు సాగగలను. నా ప్రయాణంలో ఎలాంటి మార్పులు చేసుకోనవసరం లేదు. ఇదే పంథాలో ముందుకు వెళతాను” అని వివరించాడు.కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాయకత్వంపై రోహిత్ ప్రశంసలు కురిపించాడు. “శుభ్‌మన్‌కు అద్భుతమైన క్రికెట్ పరిజ్ఞానం ఉంది. అతడు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది మాత్రమే అయింది. కాబట్టి అతడిని అప్పుడే అంచనా వేయడం సరికాదు. కానీ, మైదానంలో అతడికి ఏం కావాలో పూర్తి స్పష్టత ఉంది. ఒక కెప్టెన్‌కు ఇది చాలా ముఖ్యమైన లక్షణం. గిల్‌కు నా మద్దతు ఎప్పుడూ ఉంటుంది” అని భరోసా ఇచ్చాడు. కెప్టెన్సీ నుంచి తప్పుకున్నంత మాత్రాన జట్టుకు దూరంగా ఉండనని, గిల్‌తో తన అనుబంధం ఎప్పటిలాగే కొనసాగుతుందని స్పష్టం చేశాడు.తన కెరీర్‌లో రెండుసార్లు (2007, 2024) టీ20 ప్రపంచకప్‌లు గెలిచిన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, “భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడం ఒక ప్రత్యేకమైన అనుభూతి. ఆ ఫీలింగ్‌ను మాటల్లో వర్ణించలేం. 2024లో టీ20 ప్రపంచకప్ గెలిచినప్పుడు దాని విలువేంటో తెలిసింది. ఆ అనుభూతిని మళ్లీ పొందాలనుకుంటున్నాను. అందుకే రాబోయే వన్డే ప్రపంచకప్ గెలవడం నాకు చాలా ముఖ్యం” అని రోహిత్ తన అభిప్రాయాన్ని బలంగా వ్యక్తం చేశాడు. శనివారం న్యూ చండీగఢ్‌లో జరగనున్న మూడో వన్డేలో కూడా రోహిత్ నుంచి మరో అద్భుత ప్రదర్శనను అభిమానులు ఆశిస్తున్నారు.

# గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌తో మదనపల్లికి ప్రపంచస్థాయి గుర్తింపు

**- మదనపల్లి అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత : ఎమ్మెల్యే షాజహాన్ భాష**

**- మదనపల్లి ఎన్వీఆర్ పార్కు లేఅవుట్‌లో... గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పై ఆకాశంలో అద్భుతమైన ఆకట్టుకున్న డ్రోన్ ఎల్ఈడి షో...**



**మదనపల్లి-సూర్య వాస్తవం:**రాయలసీమ ప్రాంతాన్ని వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి ఉద్యాన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్ కార్యక్రమం మదనపల్లి ప్రాంత అభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేయనుందని మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష పేర్కొన్నారు. మదనపల్లి ఎన్వీఆర్ లేఅవుట్‌లోని మున్సిపల్ పార్కు వద్ద గురువారం సాయంత్రం నిర్వహించిన డ్రోన్ లేజర్ షోను ఎమ్మెల్యే షాజహాన్ భాష వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మదనపల్లి ప్రాంతానికి గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమం రావడం ద్వారా వ్యవసాయ, ఉద్యాన రంగాలకు మరింత ప్రాధాన్యత లభించే అవకాశం ఉందన్నారు. మదనపల్లి ప్రాంతాన్ని ఉద్యాన పంటలకు అనుకూలమైన ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, విలువ ఆధారిత ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను అనుసంధానం చేయడం ద్వారా రైతులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. హార్టికల్చర్ రంగం అభివృద్ధి చెందితే రైతులతో పాటు యువతకు ఉపాధి, వ్యాపార అవకాశాలు పెరిగే అవకాశం ఉందన్నారు. మదనపల్లికి జిల్లా హోదా కల్పించడం కూడా ప్రాంతీయ అభివృద్ధికి కీలకమైన అడుగుగా నిలిచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల మదనపల్లి ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు.

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా రాబోయే రోజుల్లో మదనపల్లి, అన్నమయ్య జిల్లా రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ఉద్యాన పంటల విస్తరణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, పెట్టుబడులకు సంబంధించిన అవకాశాలు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లలు, యువతకు కూడా భవిష్యత్తులో కొత్త అవకాశాలు ఏర్పడేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాయల సీమ ప్రాంతాన్ని వ్యవసాయ, ఉద్యాన రంగాల్లో మరింత బలోపేతం చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ పెట్టుబడిదారులు, రైతులు, వ్యవసాయ నిపుణులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎం వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ....రాయలసీమ ప్రాంతాన్ని ప్రపంచస్థాయి ఉద్యానవన ఉత్పత్తుల కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్ కార్యక్రమం ఉద్యాన రైతుల పాలిట వరంగా ఉంటుందని, ఈ ప్రాజెక్టు ఈ ప్రాంతంలో రావడం వల్ల అటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాయచోటిలో పింఛన్ల పంపిణీ

**-కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి దామచర్ల సత్య**





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:**రాయచోటి పట్టణంలోని చిత్తూరు రోడ్డులో జిన్నా కలెక్షన్ పక్క సందు, శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వెనుక వీధిలో నిర్వ హించిన పింఛన్ల పంపిణీ కార్యక్ర మంలో అన్నమయ్య లిజిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని అర్హులైన పింఛను దారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా పింఛనుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రతి నెలా అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు సకాలంలో అందించేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి జోనల్ కోఆర్డినేటర్ దామచర్ల సత్య తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు, పింఛనుదారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డికి ఘన సన్మానం



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:**మైదుకూరు పార్టీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ వింగ్, వైఎస్ఆర్సిపి యూత్ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం వైఎస్ఆర్సిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డిని పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు భూమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, జిల్లా వాలంటరీ విభాగం అధ్యక్షుడు నల్లపురెడ్డి ప్రశాంత్‌రెడ్డి, యువ నాయకులు చెన్నకేశవరెడ్డి, సోషల్ మీడియా రవి, గోవింద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి మండిపల్లిల చిత్రపటాలకు పాలాభిషేకం





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం :**అన్నమయ్య జిల్లా రాయ చోటి నియోజకవర్గం శిబ్యాల గ్రామంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నమయ్య జిల్లా శిబ్యాల గ్రామంలో ఎన్నో సంవత్స రాలుగా ఉన్నటువంటి నీటి సమస్యను రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకొని పోవడంతో స్పందించిన మంత్రి రోళ్ళమడుగు నుంచి నీటిని అందించి ఆ గ్రామం దాహార్తిని తీర్చడంతో గ్రామంలో ఉన్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ,మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కొండారెడ్డి, బూతు లెవెల్ కమిటీ సభ్యులు గంగిరెడ్డి మరియు టిడిపి కార్యకర్తలు తో పాటు గ్రామ ప్రజలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ దాహార్తిని తీర్చిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## గర్భవతులు,పిల్లలకు పౌష్టిక ఆహారం పై అంగన్వాడీ ఉత్సవ్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:**అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం మండలం లోని బి యన్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం సూపర్వైజర్ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవ్, పోషణ్ మా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27 తేదీనుండి అక్టోబర్ 10 వరకు నిర్వహించే ఉత్సవాలలో భాగంగా ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోషక హాహార వేడుకలు, అన్నప్రాసన, బాలింతలు,గర్భవతులకు అన్నప్రాశన చేస్తూ పౌష్టిక హాహారం ప్రాముఖ్యతనువివరించారు.,6 సంవత్సరాల లోపు పిల్లలకు విద్య పోషకాహారం విసిస్టితను తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, గర్భవతులు, బాలింతలు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.



## డ్రోన్ లేజర్ షోతో రాయలసీమ అభివృద్ధి దృశ్యాలు





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** గ్లోబల్ హార్టికల్చర్ హబ్ -- రాయలసీమ రైజింగ్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పిం చేందుకు నిర్వహించిన డ్రోన్ లేజర్ షో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయలసీమలో వ్యవ సాయ, ఉద్యాన రంగాల అభివృద్ధి, ఆధునిక సాగు విధానాలు, ఉద్యాన ఉత్పత్తుల విస్తరణ, రైతుల ఆదాయ అవకాశాలు, ప్రపంచస్థాయి హార్టికల్చర్ హబ్‌గా ప్రాంతం రూపుదిద్దుకునే భవిష్యత్ దృశ్యాలను డ్రోన్ కాంతుల విన్యాసాల ద్వారా ఆకాశంలో ఆవిష్కరించారు. డ్రోన్ షోను ఎమ్మెల్యే షాజహాన్ భాష వీక్షించి అభినందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ద్వారా మదనపల్లి ప్రాంతానికి అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రైతులు, యువత, వ్యాపారవేత్తలు ముందుకు రావాలని ఎమ్మెల్యే షాజహాన్ భాష పిలుపునిచ్చారు.

## కొత్తూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**-కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో**



**పెళ్లకూరు- సూర్య వాస్తవం** :పెళ్లకూరు మండలం కొత్తూరు పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండలం ఎంపీడీవో డాక్టర్ సీహెచ్. వేణయ్య పాల్గొని లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆయన తెలిపారు. పింఛన్ల కోసం లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా గ్రామస్థాయిలోనే పంపిణీ ప్రక్రియను సక్రమంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో డాక్టర్ సీహెచ్. వేణయ్య మాట్లాడుతూ....

ప్రభుత్వం నిర్దేశించిన విధానాల ప్రకారం అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. పింఛన్ పంపిణీలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వంటి లబ్ధిదారులకు పింఛన్ వారి కుటుంబ అవసరాలకు కొంతమేర ఆర్థిక భరోసాను కల్పిస్తుందని పేర్కొన్నారు.

## రక్తదాన శిబిరంలో పాల్గొన్న శ్రీ సాయి ఇంజనీరింగ్ కాజాల విద్యార్థులు





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:**శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల రక్త దాన కార్యక్రమం నిర్వహణ శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు గురువారం నాడు జాతీయ రక్తదాన దినో త్సవం సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోం నందు, ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో దీప బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు .

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే ఈ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరుగుతున్న ఈ రోజుల్లో రక్తదానం ఒక సామాజిక అవసరమని అభిప్రాయపడ్డారు. రక్తదానం ఒక ఆరోగ్యకరమైన అలవాటు అని కావున యువత రక్తదానం తప్పనిసరిగా చేయాలన్నారు. రక్తదానం మహాదానం అని దీని వలన ఊపిరితిత్తులు శుద్ధి చేయబడి దాత ఆయుష కూడా పెరుగుతుందని తెలియజేశారు రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులను అభినందిస్తూ సహకరించిన శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యానికి దీప బ్లడ్ బ్యాంక్ మరియు ప్రభుత్వ వైద్య అధికారులు కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి వెంకటరమణ మాట్లాడుతూ రక్తదానం ప్రాణ దానం తో సమానమని కావున విద్యార్థినీ విద్యార్థులు సమాజంలో ప్రజలకు రక్తదానం మరియు అవయవ దానంపై అవగాహన కల్పించి యువత స్వచ్ఛందంగా రక్తదానం కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు,దీప బ్లడ్ బ్యాంక్ సిబ్బంది మరియు ఎన్ ఎస్ ఎస్ పి ఓ ఏ రాజేష్ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140

## మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ పి.ధనుంజయులు బాధ్యతలు స్వీకరణ



**పెళ్లకూరు - సూర్య వాస్తవం :** పెళ్లకూరు మండల ప్రత్యేక అధికారిగా డాక్టర్ పి. ధనుంజయులు గురు వారం బాధ్యతలు స్వీక ఓరించారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుల పదవీకాలం ముగి యడంతో, ఆయా మండలాల పరిపాలనా వ్యవహారాలను పర్య వేక్షించేందుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారులను నియ మించారు. ఈ క్రమంలో పెళ్లకూరు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వహి స్తున్న డాక్టర్ పి.ధనుంజయులను పెళ్లకూరు మండల ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ నేపథ్యంలో ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మండలంలోని పరిపాలనా వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రత్యేక అధికారి ధనుంజయులు దృష్టి సారించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల అభివృద్ధికి అందరి సహకారం అవసరమని ఆయన అన్నారు. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పి. ధనుంజయులకు ఎంపీడీవో డాక్టర్ సి.హెచ్. వేణయ్య, డిప్యూటీ ఎంపీడీవో, ఏవోతో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు . మండలంలో జరుగుతున్న వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, పరిపాలనా అంశాలకు సంబంధించిన వివరాలను అధికారులు ప్రత్యేక అధికారికి వివరించారు. మండల ప్రత్యేక అధికారిగా తనపై అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని డాక్టర్ పి. ధనుంజయులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మండల పరిషత్ పరిపాలన సజావుగా కొనసాగించడంతో పాటు ప్రజలకు అవసరమైన సేవలను వేగంగా అందించేందుకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

## ప్రభుత్వ పాఠశాల కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన నౌజియా





**తనకల్లు- సూర్య వాస్తవం :**స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసి కమిటీ చైర్మన్ ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికలో సభ్యుల సమక్షంలో చైర్మన్‌గా నౌజియా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, భాస్కర్, ఉపాధ్యాయులు పద్మనాభ రెడ్డి. హరి కృష్ణ, నాగార్జున. పిడి జనార్ధన రెడ్డి, ఉషారాణి. అమరావతి. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు చైర్మన్ కు అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నూతన చైర్మన్ నౌజియా తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థుల విద్యాభివృద్ధికి... పూర్వ విద్యార్థులు చేయూత...!

**- ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాలుగు ల్యాప్‌టాప్‌ల అందజేత**

**- పూర్వ విద్యార్థుల సేవలకు కళాశాల ప్రిన్సిపాల్ నయిమున్నిసా బీ కృతజ్ఞతలు**

**పత్తికొండ విద్య - సూర్య వాస్తవం :** పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి చిట్టెం హనుమాన్ ప్రసాద్ విద్యార్థుల కోసం నాలుగు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులు లక్ష్మీనారాయణ నాలుగు ల్యాప్‌టాప్‌లను కళాశాల ప్రిన్సిపాల్ నయిమున్నిసా బీకి అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. చిట్టెం హనుమాన్ ప్రసాద్ కళాశాలలో విద్య నభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగి సాఫ్ట్‌వేర్ కంపెనీని స్థాపించారని తెలిపారు. ఆయన అందజేసిన ల్యాప్‌టాప్‌లు కళాశాలలో కంప్యూటర్ సైన్స్ చదువుతున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థి చిట్టెం హనుమాన్ ప్రసాద్‌కు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ వీరేశప్ప, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




# పేదల సంక్షేమం.. పట్టణ ప్రగతికి ప్రాధాన్యం

**రూ.226 కోట్లతో కేపీ కెనాల్ అనుసంధాన తాగునీటి పథకం-స్వర్ణముఖి వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తాం**

**- లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించిన ఎమ్మెల్యే విజయశ్రీ**



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** పట్టణ అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా మని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేటలో తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. గురువారం పట్టణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, రాబోయే రోజుల్లో చేపట్టనున్న పనుల వివరాలను ప్రజలకు వివరించారు. అగ్రహారపేట, అరుంధతీవాడలోని మాతమ్మ గుడి వద్ద ప్రారంభమైన ర్యాలీ హరిజనవాడలోని వెంకటేశ్వరస్వామి దేవాలయం వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యానికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. పూలమాలలు, శాలువాలు, గజమాలలతో సత్కరించారు.

**తాగునీటి సమస్యకు పరిష్కారంపై దృష్టి**

నాయుడుపేట ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.226 కోట్ల అంచనా వ్యయంతో కేపీ తెలుగుగంగ కెనాల్ అనుసంధాన తాగునీటి ప్రాజెక్టును చేపట్టనున్నట్లు విజయశ్రీ తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పట్టణానికి తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. పనులను త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు. పట్టణంలోని వెంకటగిరి రోడ్డులో స్వర్ణముఖి నది వరకు రహదారికి ఇరువైపులా డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాబోయే రెండేళ్లలో ఈ పనులు చేపట్టి రహదారిని అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**అర్హులకు పింఛన్లు.. టిడ్కో ఇళ్లకు దరఖాస్తులు**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. నియోజకవర్గంలో అర్హులైన వారికి మూడు దశల్లో కొత్త పింఛన్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని చెప్పారు. టిడ్కో ఇళ్ల కోసం అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**కార్మికుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా**

కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని విజయశ్రీ తెలిపారు. నిరుపేద కార్మికులకు అన్నా చెరువు ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి పథకాలు ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా అమలు చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచిం చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



# గుత్తి మున్సిపల్ పీఠంపై కుప్పల రాయల్ నాగరాజు గురి!

**- టీడీపీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి**

**- గుమ్మనూరు జయరాం నాయకత్వంలో గెలిచిన పార్టీకి విజయ బహుమతిగా అందిస్తానని వెల్లడి**

**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మున్సిపల్ ఎన్నికల్లో తెలుగు దేశం పార్టీ తరఫున మున్సిపల్ చై ర్మన్ అభ్యర్థిగా తనకు అవకాశం క ల్పించాలని కుప్పల రాయల్ నాగ రాజు కోరారు.పార్టీ నాయకత్వం, నాయకులు,కార్యకర్తలు,ప్రజల ఆ శీస్సులతో ఎన్నికల్లో పోటీ చేసే అవ కాశం లభిస్తే విజయానికి కృషి చేస్తా నని తెలిపారు.ఈ సందర్భంగా గుత్తి మున్సిపాలిటీ ప్రజలకు,టీడీపీ నా యకులు,కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వ క నమస్కారాలు,కృతజ్ఞతలు తెలి పారు.అలాగే గుంతకల్ నియోజక వర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాం,గుత్తి--పామిడి ఇన్‌చార్జి గుమ్మ నూరు ఈశ్వర్లకు ప్రత్యేకంగా తన కృతజ్ఞతలు తెలియజేశారు."అవకా శం ఇస్తే.. గెలుపు కోసం శ్రమిస్తా.. గు త్తి అభివృద్ధికి కృషి చేస్తా" అని కు ప్ ల రాయల్ నాగరాజు పేర్కొన్నా రు.ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో పనిచేసి ఎన్నికల్లో విజయం సాధించేందుకు కృషి చేస్తానన్నారు.విజయం సాధిం చిన అనంతరం గుత్తి మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల కు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని తెలిపారు.పార్టీ అధి నేత,ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు,మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నా యకత్వానికి గుత్తి మున్సిపాలిటీ వి జయాన్ని బహుమతిగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చె ప్పారు.ప్రజాసేవే లక్ష్యంగా..గత కొం తకాలంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అందుబా టులో ఉంటున్నానని కుప్పల రా యల్ నాగరాజు తెలిపారు. పార్టీ కార్యక్రమాలు,సంక్షేమ కార్యక్రమా ల్లో చురుకుగా పాల్గొంటూ ప్రజల సమస్యలను తెలుసుకుంటున్నాన ని చెప్పారు.భవిష్యత్తులోనూ ప్రజ లకు నిరంతరం అందుబాటులో ఉం టూ గుత్తి మున్సిపాలిటీ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా నని తెలిపారు.తన అభ్యర్థిత్వానికి మద్దతు ఇస్తున్న గుత్తి ప్రజలకు,టీ డీపీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయో భిలాషులకు,తన కార్యక్రమాలను ప్ర జల్లోకి తీసుకెళ్తున్న పాత్రికేయులకు కుప్పల రాయల్ నాగరాజు ధన్యవా దాలు తెలిపారు.



# మాయమైన ఎగువపల్లి అగ్రహారం కలిసే వంక

**- జాతీయ రహదారి పేరుతో కబ్జాదారుల వంక స్థలాలకు మట్టి తరలింపు**

**- భారీ వర్షం వస్తే 500 కుటుంబాలు జలమయం**







**గార్లదిన్నె - సూర్య వాస్తవం :** సింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలంలో కల్లూరు గ్రామ పంచాయతీ లోని అగ్రహారం, ఎగువపల్లి మధ్యన ఉన్న వంక ఈ రెండు పోలాలకు మధ్య సరి హద్దు డివైడ్ కలదు, కల్లూర్అగ్రహారం పొలమునకు కల్లూరు పొలమునకు వంక స్థలం కలదని, ఈ వంక పాతమ్యాపులో రెండు పొలాల మ్యాపులో ఈ వంక చూపుతున్నదని ఇప్పుడు ఎల్పీ నంబర్ మ్యాపులో వంక అని మార్కింగ్ ఇవ్వలేదని హైవే ప్రక్కనకు వచ్చిన తర్వాత నేషనల్ హైవే44 6 వేకి అనుసంధానం కావడంతో 280 సర్వేనెంబర్ వంక ఏమాత్రం కనపడకుండా కబ్జదారులు ఆక్రమించారు.ఈరెండిటికీ మధ్యన ఉన్న వంక వర్షం వస్తే ఎగువపల్లి ఫారెస్ట్ కొండల నుంచి పొలాల మీదుగా వంక భారీగా ఉధృతంగా ప్రవహి స్తుందని కల్లూరు ప్రజలు వాపోతున్నారు. ఎగువపల్లి దగ్గర కెనాల్ కాలవ4౦5౦6 నుంచి వాటర్ వస్తుండగా 4,5,6వ డిస్ట్రిబ్యూటర్ కాలవల నీరు కూడా ఈ వంకలోకి ప్రవహిస్తాయి దీనివల్ల కల్లూరు ఆర్ఎస్ గ్రామము నీటిమొప్పునకు గురి అవుతుందని గ్రామ ప్రజలు వాపోతున్నారు ప్రక్కనే హాస్పటల్ ప్రక్కన ఉన్న 280 సర్వే నంబర్లు ఎల్పి నంబర్లు 710,711,712,716,717,718 ఈ మధ్యలో ఎల్పీ నంబర్లు కల్లూరు నుండి తరిమెల రోడ్డు ఎల్ పి నెంబర్ 714,715 జాతీయ రహదారి44 ప్రక్కన గల 713 వంకను కబ్జా దారులు ఆక్రమించు కోవడంతో అగ్రహారం పొలంలో 193 ౦192౦191 సర్వే నంబర్లలో ఉండు గృహ నివాసములు , పంచాయతీ కార్యాలయం, విజయ్ భాస్కర్ రైస్ మిల్లు, వాయుపుత్ర రైస్ మిల్లు, రాధాకృష్ణయ్య ఫ్యాక్టరీతో పాటు స్వగృహం, ఆప్రక్కన ఉన్న కాలనీ,దుర్గా రైస్ మిల్లు ఇవన్నీ వరద నీటి ముప్పునకు గురౌతాయని గృహ నివాసకులు ఆందోళన వ్యక్త పరుస్తున్నారు.

గతంలో ఇళ్లలోకి 2022 సంవత్సరములో వాటర్ ఇళ్లలోకి పోవడం జరిగిం దన్నారు. 44వ జాతీయ రహదారికి పక్కనే ఈవంక ఉన్నందున రెవెన్యూశాఖ అధికారులు, పంచాయతీ కార్యాలయం అధికారులకు విన్నవించుకొని మొరాెట్టుకున్న నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎగువపల్లి మీదుగా వచ్చే ఈవంకను దేవాలయం వంక అంటారు. 44వ జాతీయ రహదారి 6వే పేరు చెప్పుకుంటూ పక్కనే గల కొండలను భారీ యంత్రాలతో త్రవ్వి ట్రిప్పర్లతో రాత్రి పగుళ్లు మట్టిని కబ్జాదారులు వంక స్థలాలకు దాదాపు 5,6 అడుగుల ఎత్తుతో కొండ మట్టితో బూడ్చి కబ్జాదారులు ఓట్ల రూపాయలు విలువచేసే స్థలాన్ని వ్యాపార కేంద్రాలుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నారని వారిని దండించే నాధుడే లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తపరుస్తున్నారు. భారీ వర్షాలు వస్తే కల్లూరు అగ్రహారం గ్రామాలు పూర్తిగా జలమయమైతాయని ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు. ప్రభుత్వం,జిల్లా ఉన్నతాధికారులు,జిల్లా మైన్స్ అధికారులకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉంటే కఠిన చర్యలు తీసుకొని అక్రమంగా బూడ్చిన మట్టి విలువను రాయల్టీ రూపంలో భారీగా జరిమానా విధించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. మా గ్రామం వరదకు ముప్పు కాకుండా కాపాడాలని వేడుకుంటున్నారు.

# ప్రజాస్వామ్య తీర్పును... ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు...!

**- ఓటమిని అంగీకరించలేకే తిప్పన్న తప్పుడు ఆరోపణలు: టీడీపీ నాయకుడు రంగన్న**



**కర్నూలు - సూర్య వాస్తవం :** పెద్దహుల్తి పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలో వెలువడిన ఫలితాన్ని జీర్ణించుకోలేకనే టీడీపీ--వైఎస్సార్ వర్గాలు ఏకమయ్యాయని తిప్పన్న నిరాధార ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు రంగన్న విమర్శించారు. ఎన్నికల్లో ఓటు వేసింది కమిటీ సభ్యులేనని, ప్రజాస్వామ్య ప్రక్రియలో వచ్చిన తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిందేనని అన్నారు. టీడీపీ--వైఎస్సార్ వర్గాలు ఏకమయ్యాయని చెబుతున్న తిప్పన్న అందుకు ఆధారాలను ప్రజల ముందు ఉంచాలని రంగన్న డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా రాజకీయ ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించడం సరికాదన్నారు.ఒక ఓటు తేడాతో గెలిచినా అది ప్రజాస్వామ్య విజయమేనని రంగన్న పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు విలువ ఉంటుందని, ఒక్క ఓటు కూడా ఓటేనని అన్నారు. ఎన్నికల ఫలితాన్ని అంగీకరించకుండా "ఒకే ఓటుతో ఎలా?" అని ప్రశ్నించడం సరైన విధానం కాదన్నారు.తనను ఎదుర్కొనేందుకు అందరూ ఏకమయ్యారని తిప్పన్న చెప్పుకోవడం రాజకీయంగా సమర్థనీయం కాదని రంగన్న అన్నారు. ప్రజలు ఎవరిని ఆదరిస్తున్నారో ఎన్నికల ఫలితాలే వెల్లడిస్తాయని, ఆ తీర్పును గౌరవించడం రాజకీయ సంస్కారమని పేర్కొన్నారు. పాఠశాల విద్యా కమిటీని రాజకీయ వేదికగా మార్చింది ఎవరో ముందుగా తిప్పన్న ఆత్మపరిశీలన చేసుకోవాలని రంగన్న సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు, పాఠశాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, రాజకీయ ఆరోపణలతో విద్యార్థుల ప్రయోజనాలను పక్కన పెట్టవద్దన్నారు. పాఠశాలలో ఏవైనా సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి నిర్మాణాత్మకంగా ముందుకు రావాలని సూచించారు. "ఓటు ప్రజల చేతిలో ఉన్న తీర్పు.. దాన్ని మార్చే అధికారం ఎవరి చేతిలోనూ లేదు" అని రంగన్న అన్నారు.గెలుపు--ఓటములు ఎన్నికల్లో సహజమని, గెలిచినవారిని అభినందించడం, ఓడినవారు ఫలితాన్ని గౌరవించడం ప్రజాస్వామ్య సంప్రదాయమని పేర్కొన్నారు. ఇకనైనా ఆరోపణల రాజకీయాలను పక్కనపెట్టి పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని తిప్పన్నకు సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దహుల్తి గ్రామ విద్యా కమిటీ చైర్మన్ రంగస్వామి, టీడీపీ నాయకులు బోయ రంగస్వామి, అశోక్, కారుమంచి మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అరకు కాఫీని గౌరవించుకోవడం గర్వకారణం

**- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**అమరావతి- సూర్య వాస్తవం :** అంతర్జాతీయ కాఫీ దినోత్సవం సందర్భంగా తూర్పు కనుమల అద్భుతమైన ప్రకృతి ఒడిలో పండే ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక సంపద అయిన 'అరకు కాఫీ'ని గౌరవించుకోవడం ఎంతో గర్వకారణమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అరకు కాఫీలోని ప్రతి కప్పు తూర్పు కనుమల సువాసనను, అక్కడి నేల సారవంతమైన గుణాన్ని, గిరిజన రైతుల కఠోర శ్రమను తనలో ఇముడ్చుకుని ఉంటుందన్నారు. 'నా దృష్టిలో, అరకు కాఫీ అంటే కేవలం దాని రుచి, సువాసన మాత్రమే కాదు. ఇది మన అడవులు, గిరిజన సమాజాలు, వారి సంప్రదాయ విజ్ఞానం మధ్య ఉన్న అనుబంధానికి ప్రతీక' అని అన్నారు.అరకు లోయల నుంచి ఢిల్లీలోని పార్లమెంట్ వరకు అక్కడ ప్రత్యేక స్టాల్ల ద్వారా అరకు కాఫీని ప్రదర్శించారని పవన్ తెలిపారు. దీని ప్రస్థానం, సమాజాల మూలాల నుంచి వచ్చిన ఒక స్థానిక ఉత్పత్తి భారతదేశ కథను విశాల ప్రపంచానికి ఎలా చాటగలదో తెలియజేస్తుందన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కూడా అరకు కాఫీని, దాని సాగులో పాలుపంచుకుంటున్న గిరిజన కుటుంబాల కృషిని ప్రత్యేకంగా ప్రస్తావించారని తెలిపారు. అరకు కాఫీని సాధ్యం చేస్తున్న రైతులు, అడవులు, తూర్పు కనుమలను గౌరవించుకుందామన్నారు. ఆంధ్రప్రదేశ్ కొండల నుంచి ప్రపంచంలోని ప్రతి మూలకు అరకు కాఫీని చేరవేసే దిశగా కృషి చేద్దామని అన్నారు. 'ఒక కప్పు అరకు కాఫీ అంటే మన నేల రుచి, మన ప్రజల కథ, మన తూర్పు కనుమల సువాసనల కలయిక. అంతర్జాతీయ కాఫీ దినోత్సవ శుభాకాంక్షలు' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

# రోడ్డు విస్తరణకు మోక్షం ఎప్పుడు..?

**- ప్రభుత్వాలు మారుతున్నా.. పత్తికొండ రహదారి సమస్య మాత్రం తీరడం లేదు**
**- పాలకుల హామీలు కార్యరూపం దాల్చేనా ?**
**- శాశ్వత పరిష్కారం కోసం పత్తికొండ ప్రజల ఎదురుచూపులు**
**- రోడ్డు విస్తరణ పైన 'పత్తి'కొండంత ఆశలు**

దాదాపు 30 ఏళ్లుగా కొనసాగుతున్న పత్తికొండ రహదారి సమస్యకు ఇకనైనా శాశ్వత పరిష్కారం లభిస్తుందా? అన్నదే పట్టణ ప్రజల్లో ప్రధాన ప్రశ్నగా మారింది.పత్తికొండ నియోజకవర్గానికి గత 30 సంవత్సరాల నుండి వస్తున్న నాయకులు కేవలం రోడ్డు విస్తరణ కార్యక్రమానికి వాగ్దానాలకే పరిమితమయ్యారని పట్టణ వాసులు వాపోతున్నరు. ఏ నాయకుడు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టకపోవడం పత్తికొండ పట్టణ ప్రజలకు శాపంగా మారిందని అంటున్నారు. ఈ కారణంగా పత్తికొండ పరిసర ప్రాంతాల నుండి వచ్చే వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గురువారం నాడు జరిగిన ఆక్సిడెంటు సంఘటన దీనికి నిదర్శనమని ప్రజలు చెపుతున్నారు.




**పత్తికొండ - సూర్య వాస్తవం :**
పత్తికొండ పట్టణం లో రోడ్డు చిన్నదిగా ఉండడంతో పట్టణ ప్రజలు ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దుకాణ సముదాయాల ముందు సరైన పార్కింగ్ లేక వాహనాలు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసేస్తున్నారు. దింతో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పత్తికొండ చుట్టుపక్కల పల్లెలు ఎక్కువ ఉండడంతో ఆటోలు,ఆర్టీసీ బస్సులు వెళ్తూ ఉంటాయి.చుట్టూ పక్కన ఉన్న పల్లె ప్రజలు తమ అవసరాల నిమిత్తం పట్టణానికి రాకపోకలు కొనసాగిస్తుంటారు. రోడ్డు చిన్నదిగా ఉండడం మరోపక్క వాహనాల రద్దీ పెరగడంతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో రోడ్లు కొలతలు చేసి మార్కింగ్ కూడా చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు తిరిగి ఎటువంటి పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు ఆవేదన చెందుతున్నారు. చెన్నూరు పట్టణం వ్యాపారపరంగా అభివృద్ధి చెందాలంటే ఈ రోడ్డు విస్తరణ పనులు తప్పనిసరి కాని స్థానిక నాయకులు అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించకుండా నిర్లక్ష్యం వహించడంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బ్రిటీష్ హయాంలో గుత్తి నుంచి ఆదోని వరకు ఏర్పాటు చేసిన హైవే రహదారి పత్తికొండ పట్టణం నడిబొడ్డునుంచే సాగింది. అప్పట్లో పట్టణ జనాభా, వాహనాల సంఖ్య తక్కువగా ఉండటంతో సుమారు 20 అడుగుల వెడల్పుతో ఏర్పాటు చేసిన ఈ రహదారి సరిపోయేది. అయితే కాలక్రమేణా పత్తికొండ పట్టణం విస్తరించడంతో పాటు జనాభా, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాత రహదారి సామర్థ్యం సరిపోని పరిస్థితి ఏర్పడింది.ముఖ్యంగా భారీ వాహనాలు పట్టణం మీదుగా రాకపోకలు సాగించడంతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 1994లో అప్పటి ఎమ్మెల్యే ఎస్వీ సుబ్బారెడ్డి రహదారి విస్తరణకు చర్యలు చేపట్టినా, వివిధ కారణాలతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు.

దీంతో 1998లో బైపాస్ రహదారిని ఏర్పాటు చేసి భారీ వాహనాలను పట్టణంలోకి రాకుండా మళ్లించారు. దీంతో కొంతకాలం పట్టణంలో ట్రాఫిక్ సమస్యకు ఉపశమనం లభించింది. అయితే ప్రస్తుతం పట్టణ విస్తరణ మరింత పెరగడంతో పాటు ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు పెరగడంతో ప్రధాన రహదారిపై మళ్లీ ట్రాఫిక్ ఒత్తిడి పెరుగుతోంది.ఇక బైపాస్ రహదారి కూడా కాలానుగుణంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి వెడల్పు, మలుపులు, జంక్షన్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, వాహనాల పార్కింగ్ వంటి అంశాలపై సమగ్ర దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.




గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రహదారి అభివృద్ధి, విస్తరణపై పలు సందర్భాల్లో హడావుడి జరిగినప్పటికీ పనులు మాత్రం ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా సమస్య మాత్రం కొనసాగుతుండటంపై పట్టణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.పత్తికొండ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రధాన రహదారి, బైపాస్ రహదారులపై సమగ్ర సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు. రహదారి అభివృద్ధి పనులకు స్పష్టమైన కార్యాచరణ రూపొందించి, నిధులు కేటాయించి పనులను ప్రారంభించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ఇప్పటికైనా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పత్తికొండ రోడ్డు విస్తీరణ కు ప్రత్యేక చొరవ తీసుకొని రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి ట్రాఫిక్ సమస్య నుంచి ప్రజలకు విముక్తి కల్పించాలని పత్తికొండ పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# ఇప్పటికైనా రోడ్డు విస్తరణ చేపడతారా లేదా?

**- ఇంకా ఎన్ని మరణాలు జరగాలి.?**
**- పత్తికొండను బంగారు కొండ చేస్తామన్న నాయకులారా పత్తికొండ శవాల దిబ్బగా మారుతుంది.**
**- ఇప్పటికైనా విస్తరణ చేపట్టండి.?**




**పత్తికొండ - సూర్య వాస్తవం**
పత్తికొండ పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఇరుకైన రోడ్లలో వెళ్లలేని పరిస్థితుల్లో అటుగా డోన్ ఆర్టీసీ డిపోకు చెందినటువంటి ఆర్టీసీ బస్సు ఇటుగా పత్తికొండ నుండి వారి పనుల నిమిత్తం బురుజుల గ్రామానికి చెందినటువంటి గ్రామకాపురస్తులు బైక్ పై వెళుతూ ఉండగా రోడ్డు ఇబ్బంది వల్ల బస్సు టైర్ కింద మహిళ తల పగిలి అక్కడికక్కడే శిథిలమై మరణించడం జరిగింది. ఇప్పటికైనా పత్తికొండ పాలకులు రోడ్డు విస్తరణ చేపడతారా లేదా అంటూ సిపిఎం పార్టీ సిఐటియు ఆధ్వర్యంలో వెంకటేశ్వర రెడ్డి రవిచంద్ర ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అక్కడే రోడ్డుపై కూర్చుని బైఠాయించారు మరణించిన కళేబరం ముందు కూర్చుని పత్తికొండ రోడ్లు ఇరుకుగా ఉన్నాయని గత సంవత్సరం నుండి అడుగుతున్నాం పత్తికొండకు వచ్చిన పాలకులు కూడా ఎన్నికలకు ముందు వాగ్దానాలలో భాగంగా పత్తికొండ రోడ్డు విస్తరణ చేపడతామని చెప్తూ అధికారాన్ని చేపట్టిన తర్వాత వారి స్వలాభాల కోసం పని చేసుకుంటూ ఇలాంటి ఘటనలు జరిగినా కనీసం కన్నెత్తైనా చూడలేని అధికారులు పాలకులు పత్తికొండ పై ఎందుకింత కక్ష సాధింపు చర్య అని వారు ఆవేదన వ్యక్తం చేశారు అక్కడే ఎమ్మెల్యే రావాలి అంటూ ఘటన స్థలంలో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించాలంటూ రోడ్డు విస్తరణ చేపట్టాలంటే పాలుకల నిర్లక్ష్య వైఖరి నశించాలంటూ రోడ్డు విస్తరణ చేపట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బాధితురాలి కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ప్రకటించాలంటూ వారు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపట్టి అక్కడే బయటనుంచి నినాదాలు చేస్తూ ఉన్న సందర్భంలో స్వచ్ఛందంగా ప్రజలు కూడా వారితో గొంతు కలిపి రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాలి కనీసం మనకు సిగ్గు ఏదైనా ఉంది అంటే ఇకపై వచ్చే పాలకులను అగ్రిమెంట్ రూపకంగా రోడ్డు విస్తరణ చేస్తే తప్ప వారికి ఓట్లు వేయమని అదే బైఠాయించినటువంటి ప్రాంగణంలో ప్రజలు స్వచ్ఛందంగా చెబుతూ నినాదాలు చేయడం పత్తికొండ ప్రజలను అక్కడ ఘటనా స్థలంలో ఉండే ప్రజలకు కంట తడి పెట్టించింది. సందర్భంగా సిపిఎం పార్టీ సిఐటియు నాయకులు వెంకటేశ్వర రెడ్డి రవిచంద్ర మాట్లాడుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గతం నుండి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న కనీసం నిమ్మకు నేరెత్తినటువంటి విధంగా కూడా లేని పాలకులు అధికారులు నిర్లక్ష్య వైఖరి నశించాలని వెంటనే పత్తికొండ రోడ్డు విస్తరణ చేపట్టాలని లేనిపక్షంలో పత్తికొండ రోడ్లలో వేలాది మందితో రోడ్డు విస్తరణకై ఉధృతమైనటువంటి ఉద్యమాన్ని చేపడతామని ఎమ్మెల్యే కాన్వాయ్ లను కూడా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి వెంకటేశ్వర్లు మండల కమిటీ సభ్యులు రామాంజనేయులు సురేంద్ర రైతు సంఘం నాయకులు రాజుల కారప్ప మహిళ సంఘం మండల కార్యదర్శి కృష్ణవేణి ప్రజాసంఘాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

